

RNI NO.TGTEL/25/A5224

జోర్దార్ ది

JORDAR TELUGU DAILY తెలుగు దినపత్రిక

అవినీతి అంతం - మా పంతం



కరీంనగర్ సంపుటి : 01 సంచిక : 303 శనివారం, నవంబర్ 21 2026 , పేజీలు - 8 వెల : 2/- epaper.jordar.com

ప్రభుత్వ ఉద్యోగుల ఆరోగ్య పథకంలో డిపెండెంట్లను ఎంచుకునే అవకాశం

మహిళా ఉద్యోగులకు ఎంపిక ఇవ్వండి..!

- అత్తమామలకు వైద్యం అందించే హక్కు ఇవ్వండి.. కోడలి బాధను అర్థం చేసుకోండి
- ప్రభుత్వ ఉద్యోగుల ఆరోగ్య పథకంలో మహిళలల ఆవేదనకు పరిష్కారం చూపాలి


జోర్దార్, తెలంగాణ బ్యూరో :ప్రభుత్వ ఉద్యోగులు, సేవా విరమణ పొందినవారు, కుటుంబ విరమణ వేతనం పొందేవారు, వారిపై ఆధారపడిన కుటుంబ సభ్యులకు ఉద్యోగుల ఆరోగ్య పథకం ద్వారా వైద్య సదుపాయాలు కల్పిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం, మహిళా ఉద్యోగుల విషయంలో మరింత ఉదారంగా, వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా ఆలోచించాల్సిన అవసరం ఉంది.

ప్రస్తుత నిబంధనల ప్రకారం మహిళా ఉద్యోగులు తమ తల్లిదండ్రులను వైద్య సదుపాయాల కోసం కుటుంబ సభ్యులుగా చేర్చుకునే అవకాశం ఉంది. తమ అత్తమామలను చేర్చుకునే అవకాశం మహిళా ఉద్యోగులకు లేదు.

➔ వివాహం తరువాత బాధ్యత అత్తమామలదే కదా..?

వాస్తవానికి వివాహం తరువాత చాలామంది మహిళా ఉద్యోగులు తమ భర్త కుటుంబంతోనే నివసిస్తూ, అత్తమామల బాధ్యతలను కూడా నిర్వహిస్తున్నారు. అలాంటప్పుడు మహిళా ఉద్యోగులకు తమ తల్లిదండ్రులు లేదా అత్తమామలు.. ఈ రెండు జంటల్లో ఏదో ఒక జంటను ఆరోగ్య పథకం పరిధిలో చేర్చుకునే వెసులుబాటు కల్పిస్తే ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది.

దత్తత తీసుకున్న తల్లిదండ్రులు లేదా జన్మనిచ్చిన తల్లిదండ్రుల్లో.. ఏదో ఒక జంటను ఎంచుకునే అవకాశం ఇచ్చిన ప్రభుత్వం మహిళా ఉద్యోగుల విషయంలోనూ అదే



ఉదారతను చూపాల్సి ఉంది.

➔ కారుణ్య నియామకం పొందిన కోడలి కథ ఎంత బాధాకరం..!

ముఖ్యంగా, కారుణ్య నియామకం పొందిన మహిళా ఉద్యోగుల పరిస్థితిని ప్రభుత్వం ప్రత్యేకంగా పరిగణనలోకి తీసుకోవాలి. కుటుంబ పెద్దగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగి మరణించినప్పుడు, అతని భార్యకు కారుణ్య నియామకం కల్పిస్తారు. ఆ కుటుంబంలో మిగిలిన సభ్యుల పోషణ బాధ్యత కూడా చాలావరకు ఆమె పైనే ఉంటుంది.ముఖ్యంగా, మరణించిన ఉద్యోగి తల్లిదండ్రులు వృద్ధాప్యంలో ఉండి, ఆర్థికంగా, ఆరోగ్యపరంగా తమ కోడలిపైనే ఆధారపడే పరిస్థితులు అనేక కుటుంబాల్లో ఉన్నాయి. భర్త మరణించిన తర్వాత కుటుంబ బాధ్యతలను స్వీకరించి, ఉద్యోగం చేస్తూ అత్తమామలను పోషిస్తున్న మహిళా ఉద్యోగులకు, వారి అత్తమామలను ఆరోగ్య పథకం పరిధిలో చేర్చుకునే అవకాశం లేకపోవడం అన్యాయమే కాకుండా బాధాకరం కూడా.

➔ కొడుకు బతికి ఉంటే వచ్చే సదుపాయం.. కోడలికి ఎందుకు రాదు..?

కొడుకు జీవించి ఉండి ఉద్యోగంలో కొనసాగితే అతని తల్లిదండ్రులకు లభించే వైద్య సదుపాయాలు, అతని మరణానంతరం కోడలు కారుణ్య నియామకం పొందిన తర్వాత ఎందుకు అందుబాటులో ఉండకూడదు? కుటుంబ బాధ్యతలను స్వీకరించిన మహిళకు అత్తమామల ఆరోగ్య సంరక్షణ బాధ్యతను నిర్వహించే అవకాశం కూడా కల్పించాలి కదా!

➔ మానవీయ కోణంలో చూడాలి..!

మహిళా ప్రభుత్వ ఉద్యోగులు, సేవా విరమణ పొందిన మహిళల విషయంలో తమ జన్మనిచ్చిన తల్లిదండ్రులు లేదా భర్త తల్లిదండ్రులు.. ఈ రెండు జంటల్లో ఏదో ఒక జంటను ఎంపిక చేసుకుని ఆరోగ్య పథకం కింద వైద్య సదుపాయాలు పొందేలా నిబంధనల్లో తగిన సవరణలు చేయాలి.

ఇది ప్రభుత్వంపై అనవసరమైన భారాన్ని మోపే అంశం కాదు. కుటుంబ బాధ్యతలను మోస్తున్న మహిళా ఉద్యోగులకు అందించే ఒక మానవీయమైన వెసులుబాటు మాత్రమే. తల్లిదండ్రులు లేదా అత్తమామలు ఏదో ఒక జంట మాత్రమే ఆరోగ్య పథకం పరిధిలోకి వస్తారు కాబట్టి, ఈ చర్యతో రాష్ట్ర ప్రభుత్వంపై అదనపు ఆర్థిక భారం కూడా పడదు.ప్రభుత్వం ఈ దిశగా సానుకూల నిర్ణయం తీసుకుంటే రాష్ట్రంలోని వేలాది మంది మహిళా ఉద్యోగులకు, వారి కుటుంబాలకు ఎంతో ఊరట లభిస్తుంది. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గారు ఈ అంశాన్ని మానవీయ కోణంలో పరిశీలించాలని మహిళా ముద్యోగులు,వారిపై ఆధారపడినవారు కోరుతున్నారు..

జోర్దార్ వార్తకు స్పందన!




- మధ్యాహ్న భోజన ఏజెన్సీ తొలగింపు!
- కొత్త ఏజెన్సీ ఏర్పాటుకు ఆదేశాలు.. పాఠశాలకు వెళ్లి విచారణ జరిపిన మండల విద్యాధికారి శ్రీనివాస్

(హనుమకొండ/హసన్‌పర్తి, జోర్దార్ ప్రతినిధి) : జోర్దార్ తెలుగు దినపత్రికలో ప్రచురితమైన వార్తకు జిల్లా యంత్రాంగం స్పందించింది. హసన్‌పర్తి మండలం జయగిరి ప్రాథమికోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వహణలో జరుగుతున్న అవకతవకలు, విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించ కపోవడంపై తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తూ ప్రస్తుత ఏజెన్సీని తొలగించాలని డిమాండ్ చేసిన విషయం తెలిసిందే. ఈ సమస్యను జోర్దార్ దినపత్రిక వెలుగులోకి తీసుకురావడంతో అధికారులు స్పందించి చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలో మండల విద్యాధికారి శ్రీనివాస్ పాఠశాలను సందర్శించి పరిస్థితులను పరిశీలించారు. ఈ నెల 20న విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. సమావేశంలో మెజార్టీ తల్లిదండ్రులు ప్రస్తుతం కొనసాగుతున్న మధ్యాహ్న భోజన ఏజెన్సీని తొలగించాలని స్పష్టం చేశారు. గ్రామంలో ఉన్న మిగతా ఐదు ఏజెన్సీల్లో అర్హత కలిగిన వారికి కొత్తగా అవకాశం కల్పించాలని కోరారు. తల్లిదండ్రుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్న మండల విద్యాధికారి ప్రస్తుత ఏజెన్సీని తొలగించి, కొత్త ఏజెన్సీ ఎంపిక బాధ్యతను గ్రామ మహిళా సమాఖ్య (వీఓ)కు అప్పగించారు.విద్యార్థులకు ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం నాణ్యమైన, పౌష్టికాహారంతో కూడిన మధ్యాహ్న భోజనం అందించాలని అధికారులకు సూచించారు. పాఠశాల నిర్వహణలో విద్యా ర్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా గ్రామస్తులు సహకరించాలని మండల విద్యాధికారి శ్రీనివాస్ కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వెంకటేశ్వర్లు, పాఠశాల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.విద్యార్థుల సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి, మధ్యాహ్న భోజన ఏజెన్సీ మార్పునకు కారణమైన జోర్దార్ తెలుగు దినపత్రికకు విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకొచ్చిన వార్తకు అధికారుల స్పందనతో విద్యార్థులకు న్యాయం జరిగిందని వారు హర్షం వ్యక్తం చేశారు.

సదరం ధ్రువీకరణ పత్రాలు

అర్హులకు అందించాలి

(కరీంనగర్ జోర్దార్ ప్రతినిధి:వికలాంగుల ధృవీకరణ పత్రాల జారీలో కొందరు వైద్యుల అవినీతి బాగోతం రోజురోజుకు కరీంనగర్ జిల్లాలో విచ్చలవిడిగా మారుతోంది. బ్రోకర్ల వ్యవస్థను అడ్డుపెట్టుకుని, అర్హత లేని వారికి సైతం అడ్డగోలుగా వికలాంగ సర్టిఫికెట్లు అంటగడుతూ ప్రభుత్వ ఖజానాకు భారీగా గండి కొడుతున్నారనే ఆరోపణలు వివిధ గ్రామలలో తీవ్ర కలకలం రేపుతున్నాయి.సాధారణ వైద్య ధృవీకరణ ప్రక్రియలో పారదర్శకత లోపించడం, కొందరు సర్టిఫికెట్లు జారీ చేస్తుండటంతో నిజమైన లబ్ధిదారులకు అన్యాయం జరుగుతోంది. ఒక్కో సర్టిఫికెట్‌కు రూ. ముప్పయి వెల రూపాయల నుండి అంతకు మించి మధ్యవర్తుల ద్వారా వసూలు చేస్తూ, ధృవీకరణ పత్రాలను అంగట్లో సరుకులా విక్రయిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.డాక్టర్లు ఇచ్చిన సర్టిఫికెట్ల ఆధారంగానే వికలాంగుల పింఛన్లు మంజూరు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఫలితంగా ప్రతి గ్రామంలోనూ అనర్హుల జాబితా పెరిగిపోతోంది. పాత



పింఛన్లకు తోడు కొత్తగా మంజూరవుతున్న పింఛన్ల వల్ల ఏటా ప్రభుత్వానికి కోట్ల రూపాయల ప్రజాధనం వృథా అవుతోంది. అలాగే విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ అధికారులు తక్షణమే రంగంలోకి దిగి, అక్రమాలకు పాల్పడుతున్న డాక్టర్లు మరియు బ్రోకర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామాలలో ప్రజలు కోరుతున్నారు.వ్యవస్థాగత లోపం: వైద్య ధృవీకరణ అనేది అత్యంత బాధ్యతాయుతమైన ప్రక్రియ. ఇందులో డిజిటల్ ట్రాకింగ్ లేదా వీడియో రికార్డింగ్ వంటి కట్టుదిట్టమైన నిబంధనలు లేకపోవడం అవినీతికి ఆస్కారం ఇస్తోంది.

బ్రోకర్ల ద్వారా నేరుగా కాకుండా మధ్యవర్తుల ద్వారా బేరసారాలు జరపడం వల్ల బాధ్యులపై నేరుగా ఆధారాలు దొరకకుండా పోయే ప్రమాదం ఉంది.నిజమైన అర్హులకు అన్యాయం జరుగుతుంది.ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న నిరుపేదలకు అందాల్సిన సంక్షేమ ఫలాలు అనర్హుల పాలవుతున్నాయి.


వికలాంగ సర్టిఫికెట్ల పునఃపరిశీలన చేపట్టడం.

విజిలెన్స్ మరియు వైద్యారోగ్య శాఖల సమన్వయంతో ఆకస్మిక తనిఖీలు నిర్వహించడం.అక్రమ సర్టిఫికెట్లు జారీ చేసిన వైద్యుల పై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ప్రజలు కోరుతున్నారు

శాతవాహన విశ్వవిద్యాలయంలో

అర్హత లేని నియామకాలా..?

- ఉపకులపతి తీరుపై అధ్యాపకుల ఆగ్రహం.. నిబంధనలకు తూట్లు పొడుస్తున్నారా..?
- పరీక్షలు, బోధన పక్కనపెట్టి వివాదాలకే పెద్దపీటా..?



(కరీంనగర్, జోర్దార్ ప్రతినిధి) :ఉత్తర తెలంగాణకు పెద్ద దిక్కుగా ఉన్న కరీంనగర్ జిల్లాలోని శాతవాహన విశ్వవిద్యాలయంలో వివాదాలకు అంతే లేకుండా పోతోంది. అది నుంచి ఆరోపణలు, విమర్శలు, నియామకాల్లో అర్హత లేని అభ్యర్థులకు అవకాశాలు, అధ్యాపకుల పట్ల అలసత్వ వైఖరి వంటి అంశాలు వరుసగా వెలు గులోకి వస్తున్నాయి. విద్యా ప్రమాణాలు పెంచాల్సిన చోట, వివాదాలే ప్రధానంగా మారుతున్నాయని విద్యా వేత్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

➔ అధ్యాపకుల అర్హతలపై ప్రశ్నలు..!

విశ్వవిద్యాలయంలో అధ్యాపకుల నియామక విషయంలో అర్హతలను పక్కనపెడుతున్నారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తు న్నాయి. రాష్ట్ర స్థాయి అర్హత పరీక్ష, జాతీయ స్థాయి అర్హత పరీక్ష, పరిశోధక పట్టా వంటివి లేని వారికి కూడా అవకాశాలు ఇస్తున్నారని తెలుస్తోంది. పరిశోధక పట్టా కూడా లేని వారు విద్యాబోధన చేస్తున్నారని, ప్రధాన అండుడు చదువుగారంగా మార్చడానికి ప్రయత్నిస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. ఉన్నత విద్యను అభ్యసించేందుకు యువత విశ్వవిద్యాలయానికి వస్తే, వారికి బోధించే వారికి అర్హత లేకపోతే భవిష్యత్తు ఏమవుతుందని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు.

➔ కొత్త ఉపకులపతి వచ్చినా మారని తీరు..!

అధ్యాపకుల అర్హతలకు తెరదీసి, వివాదాలను ముందుకు తెచ్చారు. తాజాగా అధ్యాపకుల అర్హతలపై తెరదీసిన వివాదం, నియామకాల్లో అర్హత లేని వారికి అవకాశం ఇస్తున్నారన్న ఆరో పణలు మళ్లీ కలకలం రేపుతున్నాయి. నియామకాల్లో అర్హత, నిబంధనలను పాటించాల్సిన బాధ్యత విశ్వవిద్యాలయం పాలక వర్గంపై ఉంది. కానీ ఆ బాధ్యతను విస్మరించి, ఇష్టానుసారం నియామకాలు జరుగుతు న్నా యని ఆరోపణలు వస్తున్నాయి.

➔ రాజకీయ ఒత్తిళ్లకు వేదికగా విశ్వవిద్యాలయం..?

రాజకీయ ఒత్తిళ్ల కారణంగా కొందరికే అవకా శాలు ఇస్తున్నారన్న అనుమానాలు వ్యక్తమ వుతున్నాయి.

నిబంధనల ప్రకారం నియామకం జరగాల్సి ఉండగా, తమ వారికి అవకాశం కల్పించేందుకు నిబంధనలను సడలిస్తున్నారని విమర్శిస్తున్నారు.అధ్యాపకుల నియామకాల్లో కూడా అర్హత లేని వారికి అవకాశం ఇవ్వడం వెనుక ఎవరి ఒత్తిడి ఉందో బయటపెట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

➔ బోధన ప్రమాణాలు అడుగంటుతున్నాయా..?

అర్హత లేని వారు బోధిస్తే విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతింటుందని విద్యావేత్తలు హెచ్చరి స్తున్నారు. విశ్వవిద్యాలయం పేరు ప్రతిష్ఠలు దెబ్బతినడమే కాకుండా, విద్యార్థులు నాణ్యమైన విద్యకు దూరమవుతున్నారని అంటున్నారు .విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, నిబం ధనల ప్రకారం మాత్రమే నియా మకా లు జరగాలని, అర్హత లేని నియామకాలను వెంటనే రద్దు చేయా లని, బాధ్యులపై చర్యలు తీసుకో వాలని అధ్యాపకులు, విద్యార్థులు, ప్రజలు కోరుతున్నారు.

ఉన్నతాధికారులు జోక్యం చేసుకోవాలి

ఈ విషయంపై ఉన్నతాధికారులు వెంటనే స్పందించి, విచారణ జరిపించాలని కోరుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా జరిగిన నియామకాలు ఏమైనా ఉంటే వాటిని రద్దు చేసి, అర్హులైన వారికి అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. లేదంటే విశ్వవిద్యాలయం వివాదాలకు నిలయంగా మారి, విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలోకి వెళుందని హెచ్చరిస్తున్నారు.


అటల్ టింకరింగ్ ల్యాబ్‌లో అవినీతి ఆరోపణలు..

విద్యార్థుల నిధులు స్వాహా?

- తప్పుడు బిల్లులతో నిధుల ఖర్చు.. ప్రశ్నించిన చైర్మన్‌కు రూ.2 లక్షలు ఇచ్చినట్లు ఆరోపణలు
- జిల్లా విద్యాశాఖలో సెక్టోరియల్ అధికారిగా కొనసాగుతున్న వ్యక్తిపై చర్యలేవీ?

(రాజన్న సిరిసిల్ల, జోర్దార్ ప్రతినిధి) :రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో అటల్ టింకరింగ్ ల్యాబ్ నిధుల దుర్వినియోగం జరిగినట్లు తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. విద్యార్థుల్లో సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించేందుకు ప్రభుత్వం మంజూరు చేసిన లక్షలాది రూపాయల నిధులను అప్పటి ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు దబ్బెడ హనుమాన్లు తప్పుడు బిల్లులు చూపించి స్వాహా చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి.నిధుల ఖర్చుపై అప్పటి పాఠశాల కమిటీ చైర్మన్ సమాచార హక్కు చట్టం ద్వారా వివరాలు కోరగా, ఈ వ్యవహారం బయటకు రాకుండా ఉండేందుకు ఆయనకు రూ.2 లక్షలు ముట్టజెప్పినట్లు ప్రచారం జరుగుతోంది. ఉపాధ్యాయులకు విందులు ఏర్పాటు చేసి వ్యవహారాన్ని మరుగునపరిచే ప్రయత్నం చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఇంతటి తీవ్ర ఆరోపణలు ఉన్నప్పటికీ విద్యాశాఖ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం




చేస్తున్నారు. ప్రస్తుతం సదరు వ్యక్తి జిల్లా విద్యాశాఖలో సెక్టోరియల్ అధికారిగా బాధ్యతలు నిర్వహిస్తున్నట్లు పేర్కొంటున్నారు. విద్యార్థులకు అందాల్సిన సాంకేతిక విద్యను దూరం చేసిన వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి, నిధుల వినియోగంపై ఆడిట్ నిర్వహించాలని, ఆరోపణలు నిజమైతే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని విద్యావేత్తలు, తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. జిల్లా విద్యాశాఖ కార్యాలయాన్ని ప్రక్షాళన చేయాలని కోరుతున్నారు.

బద్ధకం సమాధి

గడియారంలో కాలం ఉయ్యాలయ్యింది
ఊగుతున్నాడు రాత్రి పగలు నిద్రపోతూ
ఒకరోజు గడియారం ఆగిపోయింది
మెలుకువ వచ్చి ఉలిక్కిపడి చూశాడు
తనచుట్టూ సమాధి, మేస్త్రీగా బద్ధకం

కొత్త పాఠశాల

ఆకులు రాలితే వెళ్లి ఏరుకున్నాను
ప్రతి ఆకు మీద నడుస్తున్న చరిత్ర
చదవడం మొదలుపెట్టాక
ప్రపంచభాషలన్నీ అర్థమయ్యాయి
చెట్టు ఓ పాఠశాలగా మారిపోతూ....



'సాహిత్య ప్రపూర్ణ' డాక్టర్ కె.జ. వేణు
98480 70084

50 ఏళ్లు దాటిన చేనేత కార్మికులకు
పెన్షన్లు మంజూరు చేయాలి



హుజూరాబాద్,జోర్దార్ ప్రతినిధి:50 ఏళ్లు దాటిన అర్హులైన చేనేత కార్మికులకు ప్రభుత్వం తక్షణమే పెన్షన్లు మంజూరు చేసి వారి కుటుంబాలను ఆదుకోవాలని బీసీ జేఏసీ నాయకులు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.
హుజూరాబాద్ పట్టణంలోని పద్మాలయ క్లాత్ స్టోర్ ఆవరణలో నిర్వహించిన బీసీ జేఏసీ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు చందుపట్ల జనార్ధన్, అధ్యక్షుడు సందేల వెంకన్న మాట్లాడుతూ గత ప్రభుత్వంలో చేనేత కార్మికులకు మంజూరైన రుణాలను ప్రస్తుత ప్రభుత్వం మాఫీ చేయడాన్ని అభినందించారు. చాలీచాలని కూలీతో జీవనం సాగిస్తున్న చేనేత కార్మికులకు జియో ట్యాగింగ్ ద్వారా ఆన్‌లైన్‌లో నమోదైన 50 ఏళ్లు దాటిన వారికి పెన్షన్లు అందించాలని కోరారు. అలాగే చేనేత సహకార సంఘాల మనుగడ కోసం నూలుపై సబ్సిడీ మంజూరు చేసి చేనేత రంగాన్ని ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.
ఈ కార్యక్రమంలో బీసీ జేఏసీ ప్రధాన కార్యదర్శి ఇప్పకాయల సాగర్, ఉపాధ్యక్షులు మామునూరి ప్రవీణ్ కుమార్, కొలిపాక క్రాంతి కుమార్, తాటిపాముల కనకయ్య, విజయకుమార్, ఆళ్ల కేశవులు,రాజన్న సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యమే మహాభాగ్యం
క్రీడలతో ఆరోగ్యకర జీవనశైలి

● రీజనల్ స్థాయి అథ్లెటిక్స్ పోటీలను ప్రారంభించిన పర్సనల్ విభాగాధిపతి ఎం.డి. ఆసిఫ్



రామగిరి, జోర్దార్ ప్రతినిధి:ఆరోగ్యమే మహాభాగ్యమని, ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో క్రీడలకు ప్రాధాన్యతనిస్తూ శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని రామగుండం-3, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా పర్సనల్ విభాగాధిపతి ఎం.డి. ఆసిఫ్ సూచించారు.శుక్రవారం స్థానిక రాణి రుద్రమదేవి క్రీడా ప్రాంగణంలో ఆర్జీ-3, ఏపీఏ, భూపాలపల్లి ఏరియాల క్రీడాకారుల కోసం నిర్వహించిన రీజనల్ స్థాయి అథ్లెటిక్స్, స్విమ్మింగ్, త్రోబాల్ పోటీలను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎం.డి. ఆసిఫ్ మాట్లాడుతూ క్రీడల్లో గెలుపోటములు సహజమని, ఓటమి ఎదురైనప్పుడు నిరాశ చెందకుండా మరింత పట్టుదలతో సాధన చేసి విజయాన్ని అందుకోవాలని క్రీడాకారులకు సూచించారు. క్రీడలు ఉద్యోగుల్లో క్రమశిక్షణ, సమయపాలన, పట్టుదలతో పాటు సమష్టి కృషి, జట్టు స్ఫూర్తిని పెంపొందిస్తాయని పేర్కొన్నారు.విధి నిర్వహణతో పాటు క్రీడల్లోనూ ప్రతిభను చాటుకోవడం అభినందనీయమని, క్రీడల్లో పాల్గొనడం ఆరోగ్యవంతమైన జీవనశైలికి దోహదపడుతుందని అన్నారు. క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను నిరూపించుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు పరిపూర్ణ చారి, కె. నరసింహ చారి, అధికారుల సంఘం అధ్యక్షుడు కోల శ్రీనివాస్, గౌరవ కార్యదర్శి ఎన్. వంశీధర్, క్రీడల పర్యవేక్షకుడు పర్స శ్రీనివాస్, క్రీడల సమన్వయకర్త బుర్ల సదానందం, వివిధ ఏరియాల క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

అన్నమయ్య జెడ్పీ చైర్మన్‌గా సుగవాసి ప్రసాద్ బాబు
వైస్ చైర్మన్‌గా తలారి శరణ్య

● నూతన బాధ్యతలు చేపట్టనున్న నేతలకు మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అభినందనలు



(అన్నమయ్య జిల్లా జోర్దార్ ప్రతినిధి, గాజుల శ్రీను)
అన్నమయ్య జిల్లా పరిషత్ నూతన చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేయనున్న సుగవాసి ప్రసాద్ బాబు, వైస్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టనున్న తలారి శరణ్యకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.
ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు చేపట్టనున్న చైర్మన్, వైస్ చైర్మన్‌లను మంత్రి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించి అభినందించారు. నూతన బాధ్యతలతో అన్నమయ్య జిల్లా అభివృద్ధికి మరింత కృషి చేయాలని ఆకాంక్షించారు.ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా సమిష్టి కృషితో జిల్లాను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలని మంత్రి సూచించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ జిల్లా పరిషత్ అభివృద్ధిలో నూతన అధ్యాయానికి శ్రీకారం చుట్టాలని ఆకాంక్షించారు. నూతన బాధ్యతలు చేపట్టనున్న ఇరువురికి భవిష్యత్తులో మరిన్ని విజయాలు చేకూరాలని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అభిలషించారు.

బాలల హక్కుల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

● కలెక్టర్ సత్య శారద



వరంగల్,జోర్దార్ ప్రతినిధి:బాలలకు జీవించే హక్కు, విద్య, ఆరోగ్యం, అభివృద్ధి, రక్షణ వంటి ప్రత్యేక హక్కులు ఉన్నాయని, వాటిని పరిరక్షించడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. ప్రపంచ బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని నవంబర్ 14 నుంచి 20 వరకు నిర్వహించిన బాలల వారోత్సవాల ముగింపు వేడుకలను శుక్రవారం ఆటోనగర్‌లోని ప్రభుత్వ బాలుర పరిశీలన గృహంలో నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిల్లలకు నాణ్యమైన విద్య, పౌష్టికాహారం, మెరుగైన వైద్యం అందించడంతో పాటు ఆత్మవిశ్వాసంతో ఎదిగేలా ప్రోత్సహించాలని సూచించారు.కృషి, పట్టుదలతో జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని తెలిపారు.
జిల్లా సంక్షేమ అధికారిణి రాజమణి మాట్లాడుతూ బాలల సంక్షేమం, విద్య, ఆరోగ్యం, భద్రతకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.
పోటీల్లో గెలుపొందిన వారికి కలెక్టర్ బహుమతులు అందజేశారు.
ఈ కార్యక్రమంలో పరిశీలన గృహం సూపరింటెండెంట్ శ్రీదేవి, జిల్లా బాలల పరిరక్షణ అధికారి బత్తిని కళ్యాణి, బాలల సంక్షేమ సమితి సభ్యురాలు షాహిదా బేగం, డాక్టర్ ఆకులపల్లి మధు, అధికారులు, సిబ్బంది, బాలలు పాల్గొన్నారు.

సుగవాసి ప్రసాద్ బాబుకు ఘన స్వాగతం

● చెర్లోపల్లిలో టీడీపీ శ్రేణుల సందడి.. పూలవర్షం, గజమాలతో సత్కారం



(అన్నమయ్య జిల్లా జోర్దార్ ప్రతినిధి గాజుల శ్రీను)
అన్నమయ్య జిల్లా తొలి జిల్లా పరిషత్ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసి స్వగ్రామ ప్రాంతానికి తిరిగి వస్తున్న సుగవాసి ప్రసాద్ బాబుకు గుర్రంకొండ మండలం చెర్లోపల్లి వద్ద తెలుగు దేశం పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. టీడీపీ జిల్లా నాయకుడు దుద్దల్ల హరిప్రసాద్ నాయుడు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఆయనకు ఆత్మీయ స్వాగతం పలికారు.
ప్రసాద్ బాబు కాన్వాయ్‌ను నిలిపి మంగళహారతులతో స్వాగతం పలికారు. బాణసంచా కాల్చుతూ సంబరాలు చేసుకున్నారు. పూలవర్షం కురిపించి భారీ గజమాలతో సత్కరించారు. శాలువా కప్పి శుభాకాంక్షలు తెలియజేశారు.
తమ అభిమాన నాయకుడు జిల్లా పరిషత్ చైర్మన్‌గా అత్యున్నత పదవిని అధిష్ఠించడంతో టీడీపీ శ్రేణులు, అభిమానుల ఆనందోత్సాహాలు అంబరాన్నంటాయి. చెర్లోపల్లి ప్రాంతమంతా జై తెలుగు దేశం, జై సుగవాసి నినాదాలతో మారుమోగింది.
ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. సుగవాసి ప్రసాద్ బాబుకు లభించిన ఈ పదవి ప్రజల ఆదరణకు, పార్టీ శ్రేణుల అభిమానానికి, ఆయన నాయకత్వంపై ప్రజలకు ఉన్న నమ్మకానికి నిదర్శనమన్నారు. ప్రజాసేవే లక్ష్యంగా ఆయన మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.
ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా నాయకుడు దుద్దల్ల హరిప్రసాద్ నాయుడు, చిట్టి విజయ్, గుర్రంకొండ మండల మాజీ బీజేపీ అధ్యక్షుడు రామాంజులు, భరత్, చెర్లోపల్లి గ్రామ ప్రజలు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

కార్తీక దీపోత్సవ కార్యక్రమాన్ని ప్రజలు విజయవంతం చేయాలి

● హిందూ ఉత్సవ సమితి ప్రతినిధుల విజ్ఞప్తి.



బెల్లంపల్లి జోర్దార్ ప్రతినిధి:ఈనెల 23 వ తేదీ సోమవారం రోజున ఏఏంసీ గ్రౌండ్ లో హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో శివపార్వతుల కళ్యాణం, కార్తీక దీపోత్సవ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నామని, ప్రజలందరూ అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని హిందూ ఉత్సవ సమితి అధ్యక్ష కార్యదర్శులు కోడి రమేష్, కంటెవాడ నగేష్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా బెల్లంపల్లి శాసనసభ్యులు గడ్డం వినోద్,మంత్రి వివేక్, ఎంపీ గడ్డం వంశీ కృష్ణ,ఎమ్మెల్సీ అంజిరెడ్డి,ఎమ్మెల్సీ దండే విట్టల్, సిర్పూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు, కోవలక్ష్మి, సేవా భారతి రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి పాల్గొంటున్నారని తెలిపారు.
ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,బెల్లంపల్లి నియోజకవర్గ ప్రజలు ఎల్లప్పుడు సుఖశాంతులతో సుభిక్షంగా ఉండాలనే ఉద్దేశంతో పరమ పవిత్రమైన కార్తీకమాసంలో సోమవారం సాయంత్రం 6 గంటల నుండి కార్తీక దీపోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, బెల్లంపల్లి నియోజకవర్గ ప్రజలతో పాటు చుట్టుపక్కల పల్లె ప్రాంత ప్రజలు,
మహిళ కుటుంబ సభ్యులతో సహా పాల్గొని శివపార్వతుల కళ్యాణం వీక్షించే అవకాశాన్ని వినియోగించుకొని కార్తీక దీపోత్సవంలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.
ఈ కార్యక్రమంలో హిందూ ఉత్సవ సభ్యులు బాల సంతోష్, సూరం లక్ష్మీనారాయణ, పీక లక్ష్మణ్, కట్ల అశోక్, కాసర్ల తిరుపతి తదితర సభ్యులు పాల్గొన్నారు..

ఆశ్రమ పాఠశాలల సమస్యలపై టీపీటీఎఫ్ వినతి

● విద్యార్థులకు వేడి నీరు..
● ఉపాధ్యాయులకు పని భారం తగ్గించాలి ఐటీడీఏ పీఓను కలిసి సమస్యల పరిష్కారానికి విజ్ఞప్తి



ఆదిలాబాద్ జోర్దార్ ప్రతినిధి:గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో నెలకొన్న విద్యా, మౌలిక వసతులు, ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) ఆదిలాబాద్ జిల్లా శాఖ నాయకులు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిని కలిసి వినతిపత్రం అందజేశారు. చలి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో విద్యార్థులకు వేడి నీటి సౌకర్యం కల్పించాలని, నైపుణ్యాభివృద్ధిలో భాగంగా కంప్యూటర్ బోధకులను నియమించాలని కోరారు.
శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనాలకు మరమ్మతులు చేపట్టి, తరగతి గదులకు రంగులు వేయించాలని విజ్ఞప్తి చేశారు.ఉపాధ్యాయులపై వివిధ కార్యక్రమాల పేరుతో మోపుతున్న ఆన్‌లైన్ పనిభారాన్ని తగ్గించేందుకు కంప్యూటర్ సహాయకులను నియమించాలని, ప్రధానోపాధ్యాయులను వార్డెన్ విధుల నుంచి తప్పించి హెచ్‌దబ్ల్యూఓ పోస్టులను ప్రభుత్వ నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేయాలని కోరారు.
ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న సీఆర్‌టీ ఉపాధ్యాయులకు కనీస మూల వేతనం అందేలా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని, ఐటీడీఏ పరిధిలోని ఉపాధ్యాయ ఖాళీలన్నింటినీ డీఎస్సీ ద్వారా భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు.
టీపీటీఎఫ్ నాయకులు వివరించిన సమస్యలను పీఓ కూలంకశంగా విన్నారని, తన పరిధిలో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరిస్తానని, మిగిలిన సమ స్యలను ప్రభుత్వానికి నివేదిస్తానని హామీ ఇచ్చి నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ఆత్రం భుజింగ్ రావు, జిల్లా అధ్యక్షుడు ఎం. శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి బి. వృకోధర్, కార్యదర్శి పి. బాపురావు, జిల్లా ఉపాధ్యక్షుడు సాయికాంత్ పాల్గొన్నారు

కెర్బూ సినిమా డైరెక్టర్ ఎం జె నాయుడును సన్మానించిన
మున్సిపల్ కౌన్సిలర్,దొంగల రాజకుమార్



బెల్లంపల్లి జోర్దార్ ప్రతినిధి:బెల్లంపల్లి ప్రాంతానికి చెందిన ఎం జె నాయుడు, కెర్బో సినిమాకు దర్శకత్వం వహించి, నిర్మించిన (కెరుబ్) సినిమా నేడు బెల్లంపల్లి పట్టణంలోని రామకృష్ణ థియేటర్‌లో విడుదలైన సందర్భంగా స్థానిక13వ వార్డు కౌన్సిలర్ దొంగల రాజ్ కుమార్ యాదవ్ (చింటు) థియేటర్‌లో నటీనటులతో కలిసి సినిమాను వీక్షించి అనంతరం చిత్ర బృందంలోని నటీనటులను ఘనంగా సన్మానించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానిక ప్రాంతానికి చెందిన ప్రతిభావంతులు సినీ రంగంలో రాణించడం మన బెల్లంపల్లికి ఎంతో గర్వకారణమని,ఇలాంటి మరిన్ని మంచి చిత్రాలతో మన ప్రాంతానికి రాష్ట్ర స్థాయిలో,జాతీయస్థాయిలో మరింత గుర్తింపు రావాలని ఆకాంక్షించారు.
ఈ కార్యక్రమంలో బీఆ ర్ఎస్ పార్టీ నాయకులు అసం అఖిల్,మొటగారి రాజేష్,ఇప్ప వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

RNI NO.TGTEL/25/A5224
జోర్దార్
JORDAR TELUGU DAILY తెలుగు దినపత్రిక
అవినీతి అంతం - మా పంతం

సీఎంఆర్ కుంభకోణం కేసులో మాజీ ఎమ్మెల్యే రేఖానాయక్ నివాసాల్లో ఈడీ సోదాలు

- 40.96 కోట్ల విలువైన ధాన్యం మళ్లింపుపై విచారణ
- కీలక పత్రాలు స్వాధీనం? అరెస్టుపై ఉత్కంఠ



ఆదిలాబాద్,జోర్దార్ ప్రతినిధి:నిర్మల్ జిల్లా ఖానాపూర్ మాజీ ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్ చుట్టూ కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) వ్యవహారం ఉత్కంఠ రేపుతోంది. ఈ కేసులో భాగంగా శుక్రవారం ఉదయం 6 గంటల నుంచి ఎన్ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు హైదరాబాద్‌తో పాటు ఖానాపూర్‌లోని ఆమె నివాసాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. సుమారు ఎనిమిది గంటలపాటు కొనసాగిన తనిఖీల్లో కీలక పత్రాలు, ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన వివరాలను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఖానాపూర్ సమీపంలోని సత్యనపల్లిలో ఉన్న ఆమెకు చెందిన ఏఆర్ఎస్ రైస్ మిల్లులో 2022 నుంచి 2025 వరకు మూడు రబీ సీజన్లకు సంబంధించి సీఎంఆర్ ధాన్యంలో భారీగా కొరత ఉన్నట్లు అధికారులు గుర్తించారు. సుమారు రూ.40.96 కోట్ల విలువైన 9,639 మెట్రిక్ టన్నుల ధాన్యం మళ్లించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారంపై గతంలో విజిలెన్స్ అధికారులు కేసులు నమోదు చేయగా, ఖానాపూర్ పోలీస్ స్టేషన్‌లోనూ కేసు నమోదైంది.ఈ నేపథ్యంలో రంగంలోకి దిగిన ఈడీ అధికారులు సీఆర్పీఎఫ్ బలగాల బందోబస్తు మధ్య తనిఖీలు చేపట్టారు. ధాన్యం మళ్లింపు, ఆర్థిక లావాదేవీలు, ఆస్తులకు సంబంధించిన పత్రాలను పరిశీలించినట్లు తెలుస్తోంది. రేఖానాయక్‌ను కూడా అధికారులు విచారించినట్లు సమాచారం.

బీమా రక్షణ కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం

- కలెక్టర్



ఆదిలాబాద్,జోర్దార్ ప్రతినిధి:అర్హులైన ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా రక్షణ కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. జిల్లాలోని ప్రతి గ్రామం, మున్సిపల్ వార్డులో ప్రత్యేక నమోదు శిబిరాలు నిర్వహించి అర్హులైన వారందరినీ పథకంలో నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. రేషన్ కార్డు ఉన్న కుటుంబాలతో పాటు రేషన్ కార్డు లేని కుటుంబాలు సైతం ఆధార్ ఓటిపి ద్వారా కొత్తగా నమోదు చేసుకునే అవకాశం ఉందని స్పష్టం చేశారు.

గ్రంథాలయాలు జ్ఞాన భాండాగారాలు

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



ఆదిలాబాద్,జోర్దార్ ప్రతినిధి:గ్రంథాలయాలు నిజమైన జ్ఞాన భాండాగారాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహించిన 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. యువత సోషల్ మీడియాకు ఎక్కువగా అలవాటు పడకుండా పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలని సూచించారు.పుస్తక పఠనం విజ్ఞానాన్ని, ఆలోచనా శక్తిని పెంపొందిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ నరసయ్య, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నరేష్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా



- ఎమ్మెల్యే బొజ్జు

ఆదిలాబాద్,జోర్దార్ ప్రతినిధి:న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన తొలిసారిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ సభ్యులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు.
కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్రాల నగేష్‌తో పాటు పలువురు న్యాయ వాదులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం వ్యక్తిత్వ వికాసం



- కలెక్టర్ సత్య శారద

వరంగల్,జోర్దార్ ప్రతినిధి:పుస్తకాలు మనకు మంచి స్నేహితులని, పుస్తక పఠనం ద్వారా అపారమైన జ్ఞానంతో పాటు వ్యక్తిత్వ వికాసం సాధ్యమవు తుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. శుక్రవారం జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు, బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సరస్వతీ మాత చిత్రపటానికి పూలమాల వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు చిన్ననాటి నుంచే పుస్తక పఠనాన్ని అలవర్చు కోవాలని, గ్రంథాలయాలను సందర్శించి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు.
గ్రంథాలయాల్లో పాఠకుల సంఖ్య పెరిగేలా ఉపాధ్యాయులు విద్యార్థులకు అవగాహన కల్పించాలని కోరారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.
ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మీసాల ప్రకాశ్, డీఈఓ ప్రశాంత్ రెడ్డి, జిల్లా పౌర సంబంధాల అధికారి ప్రేమలత, ఎంఈఓ వెంకటేశ్వరరావు, గ్రంథపాలకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

5 లక్షల జీవిత ఇందిరమ్మ బీమా నమోదు ప్రారంభం



వికారాబాద్,జోర్దార్ ప్రతినిధి:పేద కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ జీవిత బీమా నమోదు కార్యక్రమాన్ని వికారాబాద్ మున్సిపాలిటీలో ప్రారంభించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆశయంతో, శాసన సభాపతి, వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్ కుమార్ చొరవతో, మున్సిపల్ చైర్మన్ గడ్డం అనన్య సహకారంతో వైస్ చైర్మన్ అర్థ సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు.ఈ పథకం ద్వారా ప్రతి పేద కుటుంబంలో ఒకరికి రూ.5 లక్షల జీవిత బీమా కల్పించనుండగా, బీమా ప్రీమియాన్ని ప్రభుత్వమే చెల్లిస్తుందని తెలిపారు. 18 నుంచి 58 ఏళ్లలోపు అర్హులైన వారు ఈ పథకంలో నమోదు చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో 1వ వార్డు కౌన్సిలర్ అనం తరెడ్డి, 3వ వార్డు కౌన్సిలర్ తహరా బేగం, 4వ వార్డు కౌన్సిలర్ షబ్బీర్ అలీ, మున్సిపల్ కమిషనర్ జయసింహారెడ్డి, కౌన్సిలర్లు వినోద్ కుమార్, వేణు, మాజీ కౌన్సిలర్ మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన చాడ సురేష్ రెడ్డి, ఈగ మల్లేశం



వరంగల్,జోర్దార్ ప్రతినిధి:హన్మకొండ పట్టణంలోని పెద్దమ్మగడ్డ ఏఆర్ఆర్ కన్వెన్షన్ హాల్‌లో జరిగిన వరంగల్ మాజీ డిప్యూటీ మేయర్ కక్కె సారయ్య మనుమరాలు ధరణి, దిలీప్‌ల వివాహ వేడుకకు హన్మకొండ మాజీ ఎంపీ చాడ సురేష్ రెడ్డి, కేంద్ర ఖాదీ, చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం దంపతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించి, వారు నిండు నూరేళ్లు ఆయురా రోగ్యాలతో, సుఖ సంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు.
ఈ కార్యక్రమంలో డాక్టర్ పోల నటరాజ్,అబ్బు ప్రకాశ్ రెడ్డి, కరిమిల్ల సంపత్ రావు, సిలువేరు కుమారస్వామి, అన్నారపు రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

5 లక్షల జీవిత బీమా నమోదు ప్రారంభం



వికారాబాద్,జోర్దార్ ప్రతినిధి:పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ జీవిత బీమా నమోదు కార్యక్రమాన్ని మర్పల్లి మండలం రాంపూర్ గ్రామంలో ఎంపీడీవో శాంత ఆధ్వర్యంలో ప్రారంభించారు.
ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 18 నుంచి 58 ఏళ్ల వయస్సు కలిగి, ఆధార్, రేషన్ కార్డులు ఉన్నవారు ఈ పథకంలో నమోదు చేసు కోవాలని సూచించారు.
అర్హులైన ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల బీమా ప్రీమియాన్ని ప్రభు త్వమే చెల్లిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీవో శ్రీనివాస్,ఇతర సిబ్బంది,గ్రామస్థులు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కలను నెరవేరుస్తున్న ఇందిరమ్మ ఇళ్లు




జమ్మికుంట,జోర్దార్ ప్రతినిధి:ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేదల సొంతింటి కలను నెరవేరుస్తూ ఆర్థిక భరోసా కల్పిస్తున్నామని హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ అన్నారు. శుక్రవారం జమ్మికుంట మున్సిపల్ పరిధితో పాటు ఇల్లందకుంట మండల కేంద్రం,లక్ష్మాజిపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాలు, నూతన గృహాల నిర్మాణానికి ముగ్గుపోసే కార్యక్రమాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రణవ్ మాట్లాడుతూ ఇల్లు ప్రతి ఒక్కరి ఆత్మగౌరవానికి ప్రతీక అని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లతో పాటు ఆరు గ్యారంటీలను అమలు చేస్తోందని తెలిపారు. సొంతింటి కల నెరవేరడంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో హుజూరాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ సుహాసిని, సర్పంచులు,కాంగ్రెస్ నాయకులు,మహిళా నాయకురాళ్లు తదితరులు పాల్గొన్నారు.

అన్నమయ్య జిల్లా పరిషత్ చైర్మన్‌కు ఘన స్వాగతం



అన్నమయ్య,జోర్దార్ ప్రతినిధి:అన్నమయ్య జిల్లా తొలి జిల్లా పరిషత్ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన సుగవాసి ప్రసాద్ బాబుకు గుర్రంకొండ మండలం చెర్లోపల్లి వద్ద టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. టీడీపీ జిల్లా నాయకుడు దుద్దల్ల హరిప్రసాద్ నాయుడు ఆధ్వర్యంలో మంగళహారతులతో స్వాగతం పలికి, బాణసంచా కాల్చి, పూలవర్షం కురిపించారు. భారీ గజమాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా జై తెలుగుదేశం,జై సుగవాసి నినాదాలతో ప్రాంతం మారుమోగింది. కార్యక్రమంలో చిట్టీ విజయ్, గుర్రంకొండ మండల మాజీ బీజేపీ అధ్యక్షుడు రామాంజులు,భరత్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రిమ్స్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు



- డైరెక్టర్ డాక్టర్ బలరాం చిట్లే

ఆదిలాబాద్,జోర్దార్ ప్రతినిధి:ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రి, మెడికల్ కాలేజీలోని సమస్యలను స్వయంగా పరిశీలించి, ప్రణాళికాబద్ధంగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని నూతన రిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బలరాం చిట్లే తెలిపారు.
ఆసుపత్రి సేవల మెరుగుదలతో పాటు మెడికల్ విద్యార్థులకు నాణ్యమైన బోధన,
హాస్టల్, లైబ్రరీ వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారిస్తానన్నారు.
అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి పరిష్కారం కాని సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు.

శాంతి ఖని గని మేనేజర్ ప్రసన్న సిన్హా బదిలీ ఘనంగా వీడ్కోలు పలికిన, అధికారులు,సిబ్బంది



బెల్లంపల్లి జోర్దార్ ప్రతినిధి: మందమరి ఏరియా శాంతిఖని గని మేనేజర్ విజయ్ కుమార్ సిన్హా, ప్రమోషన్ పై కొత్తగూడెం ఏరియాకు బదిలీ కావడంతో అధికారులు, కార్మికులు, సిబ్బంది, శుక్రవారం శాలువాలతో సన్మానించి ఘనంగా వీడ్కోలు పలికారు.
సిన్హా స్థానంలో మేనేజర్‌గా లక్కాకుల మహేష్, బదిలీపై వచ్చి బాధ్యతలను స్వీకరించారు.
ఈ కార్యక్రమంలో గని ఏజెంట్ సంతోష్ కుమార్ వెల్ఫేర్ ఆఫీసర్ రవికుమార్, ఏఐటీయూసీ ఫిట్ కార్యదర్శి ప్రవీణ్ కుమార్, తదితర నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు అల్ఫోర్స్ విద్యార్థి రుతిక్ రెడ్డి ఎంపిక



- క్రీడలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపుతాయి
- డాక్టర్ నరేందర్ రెడ్డి జిల్లాస్థాయిలో ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత

కరీంనగర్ జోర్దార్ ప్రతినిధి.:క్రీడలు విద్యార్థులకు మానసిక, శారీరక ఉల్లాసాన్ని అందించడంతో పాటు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి అన్నారు. చదువుతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులు రాణించాలని, క్రీడలు ఒత్తిడిని అధిగమించి పోటీతత్వాన్ని పెంపొందించేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు.కొత్తపల్లిలోని అల్ఫోర్స్ బాలుర రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో 70వ ఎస్‌జీఎఫ్ అండర్-19 రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు విద్యార్థి ఎంపికైన సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. క్రీడల ద్వారా విద్యార్థులకు అనేక విజయావకాశాలు, ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో వివిధ క్రీడల్లో నైపుణ్యం కలిగిన విద్యార్థులకు నిష్ణాతులైన వ్యాయామ అధ్యాపకులతో శిక్షణ అందిస్తూ, పోటీల్లో పాల్గొనేందుకు అవసరమైన వనరులు కల్పిస్తున్నామని వివరించారు.ఇటీవల కరీంనగర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ క్రీడా ప్రాంగణంలో నిర్వహించిన 70వ ఎస్‌జీఎఫ్ అండర్-19 జిల్లా స్థాయి హాకీ పోటీల్లో అల్ఫోర్స్ కళాశాలకు చెందిన ఎం. రుతిక్ రెడ్డి బాలుర విభాగంలో అద్భుత ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ నెల 21న రంగారెడ్డి జిల్లాలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్న సందర్భంగా డాక్టర్ నరేందర్ రెడ్డి విద్యార్థిని అభినందించి పుష్పగుచ్ఛం అందజేశారు. రాష్ట్రస్థాయిలోనూ సత్తా చాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జర్నలిస్టులను సత్కరించిన గౌడ విద్యావంతుల వేదిక

● సమాజ నిర్మాణానికి జి.వి.వి కృషి

● వార్షిక సమావేశంలో పలు తీర్మానాలు



హైదరాబాద్, జోర్దార్ డెస్క్:గౌడ విద్యావంతుల వేదిక సర్వసభ్య సమావేశం హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. హైదరాబాద్‌లోని ఫతేమైదాన్ క్లబ్‌లో జి వి వి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశం విజయవంతమైంది. ఈ సమావేశంలో సంస్థ కార్యకలాపాలు, భవిష్యత్ ప్రణాళికలపై విస్తృతంగా చర్చించారు. సమాజ అభివృద్ధి, సేవా కార్యక్రమాలు, సంస్థాగత బలోపేతం తదితర అంశాలపై చర్చించి పలు నిర్ణయాలు తీసుకున్నారు.

ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్టులు దొంతు రమేశ్ గౌడ్, గోపగోని సప్తగిరి గౌడ్‌లను వేదిక ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. జర్నలిజం రంగంలో వారు సుదీర్ఘకాలంగా అందిస్తున్న సేవలను, సమాజ హితం కోసం చేసిన కృషిని వక్తలు కొనియాడారు. వార్తల సేకరణ, విశ్లేషణ, ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో వారు చూపిన నిబద్ధత నేటి తరం జర్నలిస్టులకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. వారికి శాలువా కప్పి, జ్ఞాపిక అందజేశారు. దొంతు రమేశ్ గౌడ్ ఎన్ టీవీ సీనియర్ జర్నలిస్ట్ అండ్ ఇన్‌పుట్ ఎడిటర్ కాగా, సప్తగిరి గౌడ్ ఆల్ ఇండియా రేడియో సీనియర్ జర్నలిస్ట్ మరియు ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ గా పనిచేస్తున్నారు. సన్మాన గ్రహీతలు వేదిక నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలు చేపడుతున్న వేదిక కృషి అభినందనీయమని వారు అన్నారు. గౌడ విద్యావంతుల వేదిక చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేయాలని అభిప్రాయపడ్డారు.

ఈ సమావేశంలో భాగంగా గౌడ విద్యా వంతుల వేదిక ఆధ్వర్యంలో ఇప్పటివరకు చేపట్టిన పలు సంక్షేమ కార్యక్రమాలను సమీక్షించారు. విద్య, సామాజిక సేవ, సంక్షేమ రంగాల్లో వేదిక చేస్తున్న కృషిని మరింత విస్తృతం చేయాలని సభ్యులు అభిప్రాయపడ్డారు.

అనంతరం భవిష్యత్ కార్యక్రమాలకు సంబంధించిన ప్రణాళికలను రూపొందించారు.

వేదిక కార్యకలాపాలను మరింత బలోపేతం చేయడం, అర్హులైన వారికి సంక్షేమ ఫలాలు అందేలా చూడ టం, విద్యావంతులను ఒకే వేదికపైకి తీసుకువచ్చి సామాజిక అభివృద్ధిలో వారిని భాగస్వాములను చేయడం వంటి అంశాలపై చర్చ జరిగింది. రానున్న రోజుల్లో చేపట్టాల్సిన కార్యక్రమాలపై సభ్యుల నుంచి సూచనలు స్వీకరించారు.

వాటిని పరిగణనలోకి తీసుకుని కార్యాచరణ రూపొందిం చాలని నిర్ణయించారు.

విద్యావంతులు సమాజాని కి దిశానిర్దేశం చేసే బాధ్యతను స్వీకరించాలని తీర్మానించారు.

ఉచిత టైలరింగ్ శిక్షణకు తోడ్పాటు :

శ్రీ నారాయణ గురు ధర్మ ప్రచార సభ , గౌడ విద్యావంతుల వేదిక సంయుక్త సహకారంతో ఉచిత టైలరింగ్ శిక్షణ కార్యక్రమాన్ని కొనసాగించాలని నిర్ణయించారు.

ఈ కార్యక్రమానికి అయ్యే ఖర్చులను రెండు సంస్థలు సమానంగా భరించాలని తీర్మానించారు.

జి వి వి సభ్యత్వ విస్తరణ:

వేదికను మరింత బలోపేతం చేయడానికి అర్హులైన విద్యావంతులు, ఉన్నతాధికారులు, వివిధ వృత్తులలో స్థిరపడిన వారిని సభ్యులుగా చేర్చుకొని సభ్యత్వాన్ని పెంచాలని నిర్ణయించారు.

సీనియర్ సిటిజన్ల సంక్షేమం:

వృద్ధులకు ఆర్టీసీ , బస్సు, రైల్వే ప్రయాణాలలో ఉచిత లేదా రాయితీ సౌకర్యాలు, పుణ్యక్షేత్రాల దర్శన సమయంలో ప్రత్యేక రాయితీలు, ఉచిత వసతి సౌకర్యాలు తదితర ప్రయోజనాలను ప్రభుత్వం కల్పించాలని వేదిక అధ్యక్షులు పల్లె ఉపేందర్ గౌడ్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ప్రభుత్వాన్ని డిమాండ్ చేయాలని నిర్ణయించారు.

ఉచిత వైద్య శిబిరాలు:

జివివి, జిడిపిఎన్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం ఉచిత మెడికల్ క్యాంపులు నిర్వహించాలని నిర్ణయించారు.

ఈ సమావేశం ద్వారా సామాజిక బాధ్యత, సంస్థాగత ఐక్యత, సేవా దృక్పథం, సమాజ అభివృద్ధి పట్ల జి వి వి తన నిబద్ధతను మరోసారి చాటుకుంది.

సమావేశానికి హాజరై విలువైన సూచనలు, సహకారం అందించిన వారిలో పద్మశ్రీ డాక్టర్ సాయి బాబా గౌడ్ (దేవ్‌నార్ ఫౌండేషన్ చైర్మన్), రఘు ప్రసాద్ గౌడ్ (జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్), వై. సత్యనారాయణ గౌడ్ (వాణిజ్య పన్నుల శాఖ మాజీ అదనపు కమిషనర్),

డాక్టర్ పి. ఉపేందర్ గౌడ్ (అనస్థీషియా ప్రొఫెసర్), మహేశ్ గౌడ్ (ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్),

సునీల్ గౌడ్ (హైకోర్టు న్యాయవాది, రాష్ట్ర బార్ కౌన్సిల్ మాజీ ఉపాధ్య క్షులు), మస్తానయ్య గౌడ్ (విద్యాశాఖ విశ్రాంత డైరెక్టర్), పరమేశ్వర్ గౌడ్ (ప్రొఫెసర్), బొర్ర శ్రీనివాస్ గౌడ్ (డెవలప్‌మెంట్ మేనేజర్), పల్లె ఉపే ందర్ గౌడ్ (కేంద్ర ప్రభుత్వ విశ్రాంత డిప్యూటీ సెక్రటరీ) ఉన్నారు.

ఆహ్వానితులుగా ఎన్ టీవీ సీనియర్ జర్నలిస్ట్, ఇన్‌పుట్ ఎడిటర్ దొంతు రమేశ్ గౌడ్, ఆల్ ఇండియా రేడియో సీనియర్ జర్నలిస్ట్, ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ సప్తగిరి గౌడ్ పాల్గొన్నారు.

తాటి చెట్టుపై నుంచి పడి
గీత కార్మికుడికి తీవ్ర గాయాలు

● విషమంగా పరిస్థితి

● హైదరాబాద్‌లోని సరోజినీ ఆసుపత్రిలో చికిత్స



మొగుళ్లపల్లి,జోర్దార్ ప్రతినిధి:మండలంలోని బంగ్లాపల్లి గ్రామంలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన బుర్ర రాజు గౌడ్ (45) గురువారం రాత్రి సుమారు 7:30 గంటల సమయంలో కల్లు గీసేందుకు తాటి చెట్టు ఎక్కి ప్రమాదవశాత్తు జారి కిందపడ్డాడు. ఈ ఘటనలో ఆయన తీవ్రంగా గాయపడ్డాడు.ఆందోళనకు గురైన భార్య తాటి చెట్టు వద్దకు వెళ్లి చూడగా, రక్తపు మడుగులో పడి ఉన్న భర్తను చూసి బోరున విలపించింది.ఆమె కేకలు వేయడంతో స్థానికులు అక్కడికి చేరుకుని ప్రైవేట్ వాహనంలో వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు.వైద్య పరీక్షల అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని సరోజినీ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి విషమంగా ఉందని, వైద్యులు చికిత్స అందిస్తున్నారని కుటుంబ సభ్యులు తెలిపారు.

ప్రభుత్వం ఆదుకోవాలని కుటుంబ సభ్యుల వేడుకోలు

రాజు గౌడ్ నిరుపేద కుటుంబానికి చెందిన గీత కార్మికుడు కావడంతో ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు. గీత కార్మికులకు ప్రభుత్వం ప్రకటించిన రూ. 5 లక్షల ప్రమాద బీమా పథకం అర్హులైన పలువురికి అందడం లేదని, దరఖాస్తుల కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదంలో గాయపడిన గీత కార్మికులకు బీమా, ఆర్థిక సహాయం సకాలంలో అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అనుమతుల్లేని ప్రైవేట్ కళాశాలలను మూసివేయాలి



● ఒక బ్రాంచ్ అనుమతితో మూడు బ్రాంచీల నిర్వహణ ఎలా?

● విద్యార్థుల నుంచి లక్షలాది రూపాయల వసూళ్లు కళాశాలలపై ప్రత్యేక కమిటీతో విచారణ చేపట్టాలి.

● యుఎస్ఎఫ్ఐ డిమాండ్

హనుమకొండ జోర్దార్ ప్రతినిధి:జిల్లాలో అనుమతులు లేకుండా అదనపు బ్రాంచీల పేరుతో ప్రైవేట్ కళాశాలలు నిర్వహిస్తున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకొని, అక్రమంగా కొనసాగుతున్న కళాశాలలను మూసివేయాలని యుఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి రాజేష్ నాయక్ డిమాండ్ చేశారు.హనుమకొండ జిల్లా కేంద్రంతో పాటు హసన్‌పర్తి మండలంలో ఒకే కళాశాల పేరుతో, ఒక బ్రాంచ్‌కు అనుమతి తీసుకొని మూడు బ్రాంచీలను నిర్వహిస్తున్నారని ఆరోపించారు. కనీసం కళాశాల బోర్డులు, కళాశాల గుర్తింపు కోడ్‌లు లేకుండానే తరగతులు నిర్వహిస్తూ విద్యార్థులు, తల్లిదండ్రుల నుంచి లక్షలాది రూపాయలు వసూలు చేస్తున్నారని విమర్శించారు. జేఈఈ మెయిన్స్, నీట్ శిక్షణ పేరుతో భారీ మొత్తంలో ఫీజులు తీసుకుంటున్నప్పటికీ తరగతి గదుల్లో సరైన సౌకర్యాలు కల్పించడం లేదని పేర్కొన్నారు.కళాశాలల్లో పూర్తిస్థాయి వైద్యులను నియమించి విద్యార్థుల ఆరోగ్యాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, మానసిక ఒత్తిడికి గురవుతున్న విద్యార్థులకు అండగా ఉండేందుకు మానసిక నిపుణులను ఏర్పాటు చేయాలని రాజేష్ నాయక్ కోరారు. అనుమతించిన విద్యార్థుల సంఖ్యకు మించి అడ్మిషన్లు తీసుకొని కళాశాలలను కొనసాగించడం నిబంధనలకు విరుద్ధమని అన్నారు.జిల్లాలో పలు కళాశాలలు ఒకటి, రెండు అనుమతులతో అదనపు బ్రాంచీలను నిర్వహిస్తున్నా జిల్లా విద్యాధికారులు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. గ్రామీణ ప్రాంతాల్లో అడ్మిషన్లే లక్ష్యంగా విచ్చలవిడిగా ప్రవేశాలు చేపడుతున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఇప్పటికైనా జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి ప్రైవేట్ కళాశాలల అనుమతులు, అడ్మిషన్లు, వసతులపై సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో యుఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు సూరజ్, జిల్లా నాయకులు సాగర్, సన్నీ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

డ్రాప్‌అవుట్ విద్యార్థుల జీవితాల్లో
వెలుగులు నింపుతున్న విజయ భాస్కర్

● ఓపెన్ స్కూల్ ద్వారా పదో తరగతి ఉత్తీర్ణతకు విశేష కృషి డాక్టర్ ఎస్. విజయ భాస్కర్ సేవలు ప్రశంసనీయం

● విశ్వనాథ గుప్త



హైదరాబాద్ జోర్దార్ ప్రతినిధి:చదువుకు దూరమైన విద్యార్థులను తిరిగి విద్యావంతులుగా తీర్చిదిద్దేందుకు శాలిబండ ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు డాక్టర్ ఎస్. విజయ భాస్కర్ చేస్తున్న కృషి అభినందనీయమని బండ్లగూడ మండల డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ విశ్వనాథ గుప్త ప్రశంసించారు.శుక్రవారం గౌలిపురా నుంచి లలితాబాగ్ వెళ్లే మార్గంలోని శాలిబండ ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల నుంచి మధ్యలో చదువు మానేసిన శివ, చింటు తదితర విద్యార్థులు తెలంగాణ సార్వత్రిక విద్యా విధానం ద్వారా ఓపెన్ స్కూల్ పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణులయ్యారు. డాక్టర్ విజయ భాస్కర్ అందించిన సలహాలు, సూచనలు, మార్గదర్శకత్వంతో వారు విజయాన్ని సాధించడంతో ఆయనను శాలువాతో సత్కరించి, స్వీట్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా విశ్వనాథ గుప్త మాట్లాడుతూ బడి మానేసిన విద్యార్థులకు ఓపెన్ స్కూల్ ద్వారా మరో అవకాశం కల్పిస్తున్న తెలంగాణ ప్రభుత్వ నిర్ణయం ప్రశంసనీయమన్నారు. చదువుకు దూరమైన వారిని గుర్తించి తిరిగి విద్యా ప్రవాహంలోకి తీసుకురావడం గొప్ప విషయమని పేర్కొన్నారు. పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు మధుసూదన్ రావు మాట్లాడుతూ విద్యార్థులు విద్యను నిర్లక్ష్యం చేయకుండా భవిష్యత్తులోనూ ఉన్నత చదువులు కొనసాగించాలని సూచించారు. వారికి సరైన మార్గదర్శనం అందిస్తూ విజయానికి బాటలు వేస్తున్న డాక్టర్ విజయ భాస్కర్ సేవలను అభినందించారు.డాక్టర్ ఎస్. విజయ భాస్కర్ మాట్లాడుతూ జీవితంలో పదో తరగతి విద్య ఎంతో కీలకమని తెలిపారు. పదో తరగతి ప్రగతి పత్రంలో జన్మతేదీ, సంవత్సరం నమోదు కావడంతో పాటు డ్రైవింగ్ లైసెన్స్, పాస్‌పోర్టు వంటి అవసరాలకు కూడా అది ముఖ్యమైన ఆధారంగా ఉపయోగపడుతుందని వివరించారు. గతంలో చాంద్రాయణగుట్ట, అఫ్జల్‌గంజ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో తెలుగు పండితుడిగా పనిచేసిన సమయంలోనూ అనేకమంది చదువు మధ్యలో మానేసిన విద్యార్థులకు ఓపెన్ స్కూల్ ద్వారా పదో తరగతి పరీక్షలు రాసి ఉత్తీర్ణులయ్యేందుకు సలహాలు, సూచనలు అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మంజుల, ప్రమీల, నవనీత, యాకూబ్, వరలక్ష్మి, టైపిస్ట్ సుధేష్ణ తదితరులు పాల్గొన్నారు. సార్వత్రిక విద్య ద్వారా పదో తరగతి ఉత్తీర్ణులైన శివ, చింటుతో పాటు ప్రస్తుతం పదో తరగతి చదువుతున్న విద్యార్థులు పాల్గొన్నారు. డాక్టర్ విజయ భాస్కర్ చేస్తున్న విద్యాసేవలను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

పోలవరం జెడ్పీ చైర్‌పర్సన్‌గా
వంతల రాజేశ్వరి బాధ్యతల స్వీకరణ



చింతూరు,(ఏపీ జోర్దార్ బ్యూరో ప్రతినిధి)పోలవరం నూతన జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా వంతల రాజేశ్వరి బాధ్యతలు స్వీకరించారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఉన్నతాధికారుల సమక్షంలో ఆమె ప్రమాణ స్వీకారం చేశారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన పార్టీ అధిష్ఠానానికి, సహకరించిన ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.

పోలవరం జిల్లా సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తానని, ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో విద్య,వైద్యం, రహదారులు,మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తానని పే ర్కొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు.

ప్రతి శనివారం భక్తులకు
తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం



చింతూరు,(ఏపీ జోర్దార్ ప్రతినిధి):పోలవరం జిల్లా రంపచోడవరం రూరల్ పరిధిలోని గోవిందగిరి ఐ.పోలవరం శ్రీవేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో ఇకపై ప్రతి శనివారం తిరుమల శ్రీవారి పవిత్ర లడ్డూ ప్రసాదం భక్తులకు అందుబాటులో ఉంటుందని ఆలయ అధికారి ఏ.శిరీష తెలిపారు.తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో లడ్డూ ప్రసాదం ఆలయానికి చేరుకుందని, భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రసాదాన్ని స్వీకరించాలని ఆమె కోరారు.

ఇందిరమ్మ కుటుంబ
జీవిత బీమా నమోదు ప్రారంభం

● అర్హులైన ప్రతి కుటుంబానికి 5 లక్షల బీమా సౌకర్యం



సైదాపూర్,(జోర్దార్ ప్రతినిధి)సైదాపూర్ మండలం లోని వెంకటేశ్వర్లపల్లి, గొల్లగూడెం గ్రామాల్లో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం నమోదు కార్యక్రమం ప్రారంభమైంది. వెంకటేశ్వర్లపల్లి గ్రామంలో జిల్లా పంచాయతీ అధికారి జగదీశ్వర్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ 18 నుంచి 59 సంవత్సరాల వయస్సు కలిగి రేషన్ కార్డు ఉన్న కుటుంబాలు ఈ పథకానికి అర్హులని, ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు. ఇతర ప్రాంతాల్లో నివ సిస్తున్న అర్హులు సైతం కుటుంబ సభ్యుల ద్వారా నమోదు చేసుకోవచ్చని సూచించారు. కార్యక్రమాల్లో సర్పంచులు రాయిశెట్టి చంద్రయ్య, బత్తుల మౌనిక, ఎంపీడీవో భూక్య యాదగిరి, ఎంపీవో బషీరుద్దీన్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చాడ కొండారెడ్డి, ఉపసర్పంచ్ దుస్స కుమార్, పంచాయతీ అధికారులు,

వార్డు సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ పథకం లో నమోదు చేసుకోవాలని ప్రజాప్రతినిధులు కోరారు.

ప్రజాప్రతినిధుల సస్పెన్షన్‌ను వెంటనే ఎత్తివేయాలి



ముత్తారం,(జోర్దార్ ప్రతినిధి)పేద విద్యార్థులకు స్కూల్ బ్యాగుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న వార్డు మెంబర్, ఉపసర్పంచ్‌లను సస్పెండ్ చేయడం అన్యాయమని పీఏసీఎస్ డైరెక్టర్ తోగరి తిరుపతి అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు విద్యా సామగ్రి అందించడం తప్పా అని ప్రశ్నించారు. గిరిజన మహిళా ప్రజాప్రతినిధికి జరిగిన అవమానాన్ని ఖండిస్తూ, సస్పెన్షన్‌ను వెంటనే ఎత్తివేసి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అలాగే పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణకు ప్రభుత్వ కార్యక్రమాల్లో తగిన ప్రోటోకాల్ కల్పించాలని కోరారు. ప్రజా అభివృద్ధి కోసం పనిచేస్తున్న ఎంపీని రాజకీయ కక్షతో అడ్డుకోవడం సరికాదని విమర్శించారు.

వైభవంగా శ్రీ లక్ష్మీ గణపతి
విగ్రహ,ధ్వజస్తంభ ప్రతిష్టాపన



● ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి

● కాంగ్రెస్ ఇన్‌చార్జి ఒడితల ప్రణవ్ బాబు

హుజురాబాద్,జోర్దార్ ప్రతినిధి:పట్టణ శివారులోని బోర్నపల్లి రోడ్డులో నూతనంగా నిర్మించిన శ్రీ లక్ష్మీ గణపతి ఆలయంలో శుక్రవారం విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్టాపన కార్యక్రమాలు వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య వైభవంగా నిర్వహించారు. సుబ్రహ్మణ్య మఠం స్వామీజీ డాక్టర్ విద్యా ప్రసన్న తీర్థ స్వామి మార్గదర్శకత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఆలయ అర్చకులు పందిళ్ల భాస్కర్ శర్మ ఆధ్వర్యంలో వేద పండితులు దేవతా మూర్తికి నేత్రోన్మీలనం, పంచగవ్య, పంచామృత అభిషేకాలు, పూర్ణాహుతి, మంత్రపుష్పం, హారతి తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు.108 కలశాలతో ధ్వజస్తంభానికి అభిషేకం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు స్వామి వారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలతో పాటు అన్నప్రసాద వితరణ చేపట్టారు.ఈ కార్యక్రమానికి హాజరైన హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, కలశాలతో ధ్వజస్తంభానికి అభిషేకం చేశారు. కాంగ్రెస్ పార్టీ హుజురాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఒడితల ప్రణవ్ బాబు కూడా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. హోమం వద్ద అగ్నిగుండం చుట్టూ ప్రదక్షిణలు చేసి వేద పండితుల ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో నాయకుల కుమారి, మున్సిపల్ చైర్‌పర్సన్ రొంటాల సుహాసిని, తహసీల్దార్ జక్కని నరేందర్, మున్సిపల్ కమిషనర్ బండి కిషన్, దేవాలయ అధ్యక్షుడు దొంత రమేష్, ప్రధాన కార్యదర్శి అంగిరక ప్రసాద్, కోశాధికారి శనగరపు నరేందర్, పలువురు కౌన్సిలర్లు, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ గందే రాధిక శ్రీనివాస్, దేవస్థాన, ఉత్సవ కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, భక్తులు, మహిళలు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాలలో విద్యా వెలుగులు

పంచిన దాసరి రాశీ రెడ్డి

భూపాల్ పల్లి జోర్దార్ ప్రతినిధి:విద్యను సమాజంలోని ప్రతి ఒక్కరికీ అందించాలనే మహోన్నత ఆశయంతో ముఖ్యంగా పేద గ్రామీణ ప్రాంత ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా జీవితాంతం కృషి చేసిన దాసరి రాం రెడ్డి గారు పరమ పదించడం అత్యంత బాధాకరం. దాసరి రాశీరెడ్డి ఉమ్మడి వరంగల్ జిల్లాలోని జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం రాయపల్లి గ్రామంలో దాసరి రాజిరెడ్డి అమృతమ్మ దంపతులకు ఆరుగురు సంతానంలో పెద్ద కుమారునిగా తేదీ 2-4-1961లో జన్మించినారు వీరి భార్య రమాదేవి టీచర్ గా పనిచేసి రిటైర్ అయినారు. వీరి పెద్ద కూతురు దాసరి హిమాని లండన్ లో ఎమ్మెస్ పూర్తి చేసి హైదరాబాద్ లోని మాత్రుశ్రీ ఇంజనీర్స్ లో డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. వీరి చిన్న కూతురు దాసరి హిమబిందు కెనడాలో ఎమ్మెస్ పూర్తి చేసి కెనడాలో క్వాలిటీ ఇంజనీర్ గా పనిచేస్తున్నారు.

మారుమూల ప్రాంతంలోని పేదలకు నాణ్యమైన విద్యను అందించాలనే సదుద్దేశంతో 1985 భారతీ ఆశ్రమ పాఠశాలను రాయపల్లి గ్రామం లింగాల క్రాస్‌రోడ్లో స్థాపించారు. చుట్టూ ఉన్న ఆరు మండలాలకు అందుబాటులో ఉన్న ఏకైక ప్రైవేటు పాఠశాల ఇది. వందలాది మంది విద్యార్థులు సుదూర ప్రాంతం నుండి కాలినడకన సైకిళ్లపై వచ్చి విద్యను అభ్యసించేవారు. సరస్వతి శిశు మందిర్ తరహాలో క్రమశిక్షణకు నైతిక విలువలకు సంస్కృతి సాంప్రదాయాలకు అధిక ప్రాధాన్యతను ఇస్తూ విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే దేవాలయంగా భారతీ ఆశ్రమ పాఠశాల వెలుగొందింది. ఈ ఆశ్రమ పాఠశాలలో చదివిన విద్యార్థులు వందలాది మంది ఉపాధ్యాయ వృత్తిలో ఇంజనీర్లుగా డాక్టర్లుగా,టీచర్స్ గా రాజకీయ నాయకులుగా వివిధ రంగాలలో పనిచేస్తున్నారు. 2002 సంవత్సరంలో శ్రీరుషి విద్యాలయ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో ఎస్ఆర్వి హైస్కూల్ హంటర్ రోడ్ వరంగల్లో స్థాపించారు. 2012 లో శ్రీ విశ్వశాంతి ఎడ్యుకేషన్ సొసైటీలో ప్రధాన భాగస్వామ్యంతో ఎస్ఆర్వి విశ్వశాంతి హైస్కూల్ ను కట్రియాల వర్ధనపేటలో స్థాపించారు. ఈ విద్యాసంస్థ నేటికి విజయవంతంగా కొనసాగుతున్నది. విద్య అనేది వ్యాపారం కాదు, సమాజ మార్పునకు పునాది అనే నమ్మకంతో పేద కుటుంబాల పిల్లలకు విద్యావకాశాలు కల్పించడమే తన ధ్యేయంగా భావించారు. ఆయన స్థాపించిన విద్యా సంస్థల ద్వారా ఎందరో విద్యార్థుల జీవితాల్లో అక్షర జ్ఞానాన్ని ఆత్మవిశ్వాసాన్ని ఉన్నత ఆశయాలను నింపారు. విద్య ద్వారా సమాజ మార్పు సాధ్యమని నమ్మి వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేసిన ఆయన సేవలు చిరస్మరణీయం. విద్యారంగంలో ఆయన చేసిన కృషి భావి తరాలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుంది. దాసరి రాశీరెడ్డి గారి విద్యా సేవ, సామాజిక సేవలు విద్యార్థుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయి. దాసరి రాశీరెడ్డిగారికి ఘన నివాళులు.నేను ప్రభుత్వ టీచర్ కావడానికి మా అన్న ప్రేరణే అని చెప్పవచ్చు మా అన్న లో రామునిల కృష్ణుడిలా అన్ని గుణాలు వున్నాయి అందుకే కాబోలు మా అన్న కి మా తల్లి దండ్రులు చిన్నప్పుడే రాముడు రాం రెడ్డి అని పేరు పెట్టారు రామునికి మేమందరం తమ్ములుగా వుండడం మా పూర్వ జన్మ సుకృతం గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధ పడుతూ మా రామన్న ఈ నెల 12 న కన్ను మూశారు వారి మరణ వార్త విని వేలాది మంది మా అన్నయ్య పార్థివ దేహానికి పూల మాలలు వేసి అయ్యో సార్ పోయార అంటూ వారి పూర్వ విద్యార్థులు ఎక్కి ఎక్కి ఏడ్చారు ప్రతి ఒక్కరూ మా బంధువులు కన్నీటి పర్యంతం అయ్యారు అప్పటి బారతి పాఠశాల ఎస్ ఆర్ వీ స్కూల్ లో పని చేసిన గురువులు బంధు మిత్రులు మా అన్న గారి అంతిమ యాత్రలో పాల్గొని వీడ్కోలు పలికారు రేగొండ మండలం నుండి మా ఊరి నుండి అనేక మంది శవ యాత్రలో పాల్గొని అమర్ రహే రాం రెడ్డి సార్ అంటూ నినాదాలు చేశారు మా అన్న రాం రెడ్డి మరణం మా కుటుంబానికి తీరని లోటు భోదికంగా వారు మా ముందు లేకున్నా జీవితాంతం మేము చేసే ప్రతి పనిలో శాశ్వతంగా నిలుచి ఉంటారు.వారి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని కోటుకుంటూ.

అన్నకు కన్నీటి నివాళులు అర్పిస్తూ
అన్న జ్ఞాపకాలని యాది చేసుకుంటూ

నవంబర్ 21న దశదిన కర్మ సందర్భముగ



తమ్ముడు "దాసరి ఇంద్ర సేనా రెడ్డి"
టీచర్ రాయప్పల్లి గ్రామం
రేగొండ మండలం

కరీంనగర్‌లోని సంతాన సాఫల్య కేంద్రాలపై ఆకస్మిక తనిఖీలు చేపట్టాలి!

- **హైదరాబాద్‌లో అండాల అక్రమ సేకరణ, రవాణా వ్యవహారంపై ఆందోళన**
- **అనుమతులు, దాతల సమ్మతి పత్రాలు, వైద్య రికార్డులను పరిశీలించాలి**
- **ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్ డిమాండ్**

(కరీంనగర్ జోర్దార్ ప్రతినిధి)హైదరాబాద్‌లో మహిళల నుంచి అండాలను అక్రమంగా సేకరించి, రవాణా చేసిన వ్యవహారం వెలుగులోకి రావడం తీవ్ర ఆందోళన కలిగిస్తోందని అఖిల భారత ఫార్వర్డ్ బ్లాక్ కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్ అన్నారు. ఈ నేపథ్యంలో కరీంనగర్ జిల్లాలో నిర్వహిస్తున్న అన్ని సంతాన సాఫల్య కేంద్రాలపై అధికారులు తక్షణమే ఆకస్మిక దాడులు, తనిఖీలు నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో డాక్టర్ పద్మజపై అండాల అక్రమ సేకరణ, రవాణా వ్యవహారంలో కేసు నమోదైనట్లు పత్రికల్లో వచ్చిన కథనాలు పలు అనుమానాలకు తావిస్తున్నాయని పేర్కొన్నారు.



జిల్లాలోనూ ఇలాంటి అక్రమాలు జరుగుతున్నాయా అనే కోణంలో అధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు. ముఖ్యంగా మహిళల నుంచి అండాల సేకరణకు సంబంధించిన అనుమతులు, దాతల సమ్మతి పత్రాలు, వైద్య రికార్డులు, అండాల నిల్వ, రవాణా, వినియోగానికి సంబంధించిన వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు.

అక్రమాలను దాచిపెడుతున్నారనే ఆరోపణలు

కరీంనగర్‌లో ఇప్పటికే నిర్వహిస్తున్న కొన్ని సంతాన సాఫల్య కేంద్రాల నిర్వాహకులు అక్రమంగా సంపాదించిన సొమ్ము, దాతల సమ్మతి పత్రాలు, వైద్య రికార్డులు, అండాల నిల్వ, రవాణాకు సంబంధించిన వివరాలను దాచిపెడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయని బండారి శేఖర్ పేర్కొన్నారు. ఈ ఆరోపణలపై అధికారులు నిష్పక్షపాతంగా విచారణ జరపాలని కోరారు. ప్రయోగశాల రికార్డులు, నిఘా కెమెరాల దృశ్యాలు, డిజిటల్ ఆధారాలు, ఆర్థిక లావాదేవీల వివరాలను చట్టబద్ధంగా పరిశీలించి భద్రపరచాలని డిమాండ్ చేశారు.

సంతానలేమితో బాధపడుతున్న దంపతుల నుంచి లక్షలాది రూపాయలు వసూలు చేస్తూ, చికిత్సలో ఉపయోగిస్తున్న అండాల మూలం, దాతల వివరాలు, వైద్య విధానాల గురించి తప్పుడు సమాచారం ఇస్తున్నట్లు తేలితే సంబంధిత వైద్యులు, కేంద్రాల యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని అన్నారు. మహిళల అనుమతి లేకుండా అండాలను సేకరించడం, అక్రమంగా రవాణా చేయడం వంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించకూడదని స్పష్టం చేశారు.

నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదు

వైద్య వృత్తిని అడ్డం పెట్టుకొని కొందరు అక్రమాలకు పాల్పడటం వల్ల నిజాయితీగా సేవలందిస్తున్న వైద్యుల వృత్తికే చెడ్డపేరు వస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, సహాయక పునరుత్పత్తి సాంకేతికత నియంత్రణ అధికారులు తక్షణమే స్పందించి జిల్లాలోని అన్ని సంతాన సాఫల్య కేంద్రాలపై సమగ్ర తనిఖీలు నిర్వహించాలని కోరారు.

అక్రమాలు నిర్ధారణ అయితే సంబంధిత కేంద్రాల నమోదు, అనుమతులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవడంతో పాటు బాధ్యులైన వైద్యులపై జాతీయ వైద్య కమిషన్‌కు ఫిర్యాదు చేసి కఠిన క్రమశిక్షణ చర్యలకు సిఫారసు చేయాలని డిమాండ్ చేశారు. మహిళల ఆరోగ్యం, గౌరవం, సంతానం కోసం ఎదురుచూస్తున్న దంపతుల ఆశలను వ్యాపారంగా మార్చుకునే వారిపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని బండారి శేఖర్ కోరారు.

శాతవాహన వర్సిటీలో అర్హతల వివాదం!

- **అధ్యాపకుల నియామకాలపై తీవ్ర ఆరోపణలు**
- **నెట్, సెట్, పీహెచ్‌డీ అర్హతలపై ప్రశ్నలు**
- **పరీక్షల విభాగం, పరిపాలనా సిబ్బంది నియామకాలపైనా అనుమానాలు**

(కరీంనగర్, జోర్దార్ ప్రతినిధి)ఉత్తర తెలంగాణకు ఉన్నత విద్యాకేంద్రంగా నిలవాల్సిన కరీంనగర్‌లోని శాతవాహన విశ్వవిద్యాలయం తరచూ వివాదాలు, ఆరోపణలతో వార్తల్లో నిలుస్తోంది. నిధుల వినియోగం, అధ్యాపకుల నియామకాలు, అటవీ అనుమతులు లేకుండా వృక్ష సంపద తొలగింపు వంటి అంశాలు గతంలో చర్చనీయాంశంగా మారగా, తాజాగా అధ్యాపకుల విద్యార్హతలపై ఆరోపణలు మరోసారి విశ్వవిద్యాలయ వ్యవహారాలను తెరపైకి తెచ్చాయి. కొత్తగా ఏర్పాటైన కళాశాలలు, సిబ్బంది నియామకాల విషయంలోనూ విమర్శలు వ్యక్తమవుతున్నాయి. విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందించాల్సిన విశ్వవిద్యాలయంలోనే బోధనా ప్రమాణాలపై ప్రశ్నలు తలెత్తడం ఆందోళన కలిగిస్తోంది.



అర్హతలు లేకుండానే బోధనా బాధ్యతలా?

విశ్వవిద్యాలయంలో కొంతమంది అధ్యాపకులకు జాతీయ అర్హత పరీక్ష (నెట్), రాష్ట్ర అర్హత పరీక్ష (సెట్) అర్హతలు లేకపోవడంతో పాటు, పీహెచ్‌డీ పట్టాలు కూడా లేని వారు బోధనా బాధ్యతలు నిర్వహిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ అంశం విద్యార్థులు, విద్యావర్గాల్లో చర్చకు దారితీస్తోంది. అధ్యాపకుల నియామకాలు ఏ నిబంధనల ప్రకారం చేపట్టారు? వారి విద్యార్హతలను ఎవరు ధ్రువీకరించారు? విశ్వవిద్యాలయ మంజూరు సంఘం (యూజీసీ) మార్గదర్శకాలను అనుసరించారా? అర్హతల విషయంలో నిబంధనలు ఉల్లంఘించారా? అన్న ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి.

పరీక్షల విభాగం నియామకాలపైనా అనుమానాలు

అధ్యాపకుల నియామకాలకే పరిమితం కాకుండా విశ్వవిద్యాలయంలో కీలకమైన పరీక్షల విభాగం, పరిపాలనా సిబ్బంది నియామకాలపైనా ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఆయా విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది విద్యార్హతలు, నియామక ప్రక్రియపై సమగ్ర వివరాలు వెల్లడించాలనే డిమాండ్ వినిపిస్తోంది. నియామకాల సమయంలో పాటించిన నిబంధనలు, ఎంపిక విధానం, అర్హతల పరిశీలనకు సంబంధించిన వివరాలను బహిరంగపరచాల్సిన బాధ్యత అధికారులపై ఉందని విద్యార్థులు అభిప్రాయపడుతున్నారు.

కేవలం తరగతులు నిర్వహించడం, పరీక్షలు పెట్టడంతోనే విశ్వవిద్యాలయం బాధ్యత పూర్తికాదని, విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు పారదర్శకమైన పరిపాలన అందించాల్సిన అవసరం ఉందని వారు పేర్కొంటున్నారు.

విచారణ జరిపితేనే అసలు నిజాలు వెలుగులోకి!

అధ్యాపకుల విద్యార్హతలు, నియామక ప్రక్రియ, పరీక్షల విభాగం, పరిపాలనా సిబ్బంది ఎంపికపై వచ్చిన ఆరోపణలన్నింటిపైనా ఉన్నతస్థాయి విచారణ చేపట్టాలని విద్యార్థులు కోరుతున్నారు. ఆరోపణల్లో వాస్తవమెంత? నియామకాలు నిబంధనలకు అనుగుణంగానే జరిగాయా? అర్హతల పరిశీలనలో లోపాలు చోటుచేసుకున్నాయా? అనే అంశాలపై అధికారులు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది.

విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడిన ఈ వ్యవహారాన్ని నిర్లక్ష్యం చేయకుండా విశ్వవిద్యాలయ అధికారులు పారదర్శకంగా వ్యవహరించాలని విద్యావర్గాలు కోరుతున్నాయి.

తరచూ వివాదాలతో వార్తల్లో నిలుస్తున్న శాతవాహన విశ్వవిద్యాలయంలో తాజా ఆరోపణలపై ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

అక్రమ ఇసుక రవాణా..

రెండు ట్రాక్టర్లు స్వాధీనం

మొగుళ్లపల్లి,(జోర్దార్ ప్రతినిధి)మొగుళ్లపల్లి మండలంలో అక్రమ ఇసుక రవాణాపై పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించి,అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు.రంగాపూర్ గ్రామంలో వేర్వేరు ప్రాంతాల్లో ఇసుక తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు పట్టుకొని విచారించగా, ఇతరుల సూచన మేరకు ఇసుకను అక్రమంగా తరలించి విక్రయిస్తున్నట్లు వెల్లడైంది.చిట్యాల సీఐ వై. సతీష్ ఆదేశాల మేరకు ఎస్ఐ ఎం. సురేష్ ఆధ్వర్యంలో రెండు ట్రాక్టర్లు, ట్రాలీలను స్వాధీనం చేసుకొని, ఇద్దరిపై వేర్వేరు కేసులు నమోదు చేశారు. అక్రమ ఇసుక రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

ప్రతి కుటుంబానికి అండగా

ఇందిరమ్మ జీవిత బీమా



- **ఇల్లంతకుంటలో పథకాన్ని ప్రారంభించిన సర్పంచ్ దార సురేష్**
- **స్వయంగా లబ్ధిదారుల వివరాల నమోదు.**
- **బీమా పత్రాల అందజేత**

(ఇల్లంతకుంట జోర్దార్ ప్రతినిధి)ఆపద సమయంలో ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ఇల్లంతకుంట గ్రామంలో సర్పంచ్ దార సురేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల వివరాలను స్వయంగా ఆన్‌లైన్‌లో నమోదు చేసి, వారికి బీమా పత్రాలను అందజేశారు.

ఈ సందర్భంగా సర్పంచ్ దార సురేష్ మాట్లాడుతూ కుటుంబ పెద్దకు అనుకోని ఆపద ఎదురైనప్పుడు ఆ కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా బీమా పథకం అండగా నిలుస్తుందని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి కుటుంబానికి చేరవేయడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

గ్రామంలో సంక్షేమ పథకాల అమలులో పారదర్శకతకు ప్రాధాన్యతనిస్తూ అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ ఫలాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ రంజిత్ కుమార్, మాజీ సర్పంచ్ రమణాచారి, గ్రామ పాలకవర్గ సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

సదరం ధ్రువీకరణ పత్రాలు అర్హులకు అందించాలి

కరీంనగర్ జోర్దార్ ప్రతినిధి:వికలాంగుల ధృవీకరణ పత్రాల జారీలో కొందరు వైద్యుల అవినీతి బాగోతం రోజురోజుకు కరీంనగర్ జిల్లాలో విచ్చలవిడిగా మారుతోంది. బ్రోకర్ల వ్యవస్థను అడ్డుపెట్టుకుని, అర్హత లేని వారికి సైతం అడ్డగోలుగా వికలాంగ సర్టిఫికెట్లు అంటగడుతూ ప్రభుత్వ ఖజానాకు భారీగా గండి కొడుతున్నారనే ఆరోపణలు వివిధ గ్రామలలో తీవ్ర కలకలం రేపుతున్నాయి.సాధారణ వైద్య ధృవీకరణ ప్రక్రియలో పారదర్శకత లోపించడం, కొందరు సర్టిఫికెట్లు జారీ చేస్తుండటంతో నిజమైన లబ్ధిదారులకు అన్యాయం జరుగుతోంది. ఒక్కో సర్టిఫికెట్‌కు రూ. ముప్పయి వెల రూపాయల నుండి అంతకు మించి మధ్యవర్తుల ద్వారా వసూలు చేస్తూ, ధృవీకరణ పత్రాలను అంగట్లో సరుకులా విక్రయిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

డాక్టర్లు ఇచ్చిన సర్టిఫికెట్ల ఆధారంగానే వికలాంగుల పింఛన్లు మంజూరు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఫలితంగా ప్రతి గ్రామంలోనూ అనర్హుల జాబితా పెరిగిపోతోంది. పాత పింఛన్లకు తోడు కొత్తగా మంజూరవుతున్న పింఛన్ల వల్ల ఏటా ప్రభుత్వానికి కోట్ల రూపాయల ప్రజాధనం వృథా అవుతోంది. అలాగే విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ అధికారులు తక్షణమే రంగంలోకి దిగి, అక్రమాలకు పాల్పడుతున్న డాక్టర్లు మరియు బ్రోకర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామాలలో ప్రజలు కోరుతున్నారు.



వ్యవస్థాగత లోపం:వైద్య ధృవీకరణ అనేది అత్యంత బాధ్యతాయుతమైన ప్రక్రియ. ఇందులో డిజిటల్ ట్రాకింగ్ లేదా వీడియో రికార్డింగ్ వంటి కట్టుదిట్టమైన నిబంధనలు లేకపోవడం అవినీతికి ఆస్కారం ఇస్తోంది.

బ్రోకర్ల ద్వారా నేరుగా కాకుండా మధ్యవర్తుల ద్వారా బేరసారాలు జరపడం వల్ల బాధ్యులపై నేరుగా ఆధారాలు దొరకకుండా పోయే ప్రమాదం ఉంది.నిజమైన అర్హులకు అన్యాయం జరుగుతుంది.ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న నిరుపేదలకు అందాల్సిన సంక్షేమ ఫలాలు అనర్హుల పాలవుతున్నాయి.

వికలాంగ సర్టిఫికెట్ల పునఃపరిశీలన చేపట్టడం.

విజిలెన్స్ మరియు వైద్యారోగ్య శాఖల సమన్వయంతో ఆకస్మిక తనిఖీలు నిర్వహించడం.

అక్రమ సర్టిఫికెట్లు జారీ చేసిన వైద్యుల పై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ప్రజలు కోరుతున్నారు

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకానికి

అర్హులు దరఖాస్తు చేసుకోవాలి

- **తెల్ల రేషన్ కార్డు కలిగిన కుటుంబాలకు అవకాశం**
- **గ్రామపంచాయతీల్లో ప్రత్యేక నమోదు శిబిరాలు**

మండలంలోని అర్హులైన కుటుంబాలు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకానికి దరఖాస్తు చేసుకోవాలని మండల అధికారులు సూచించారు. ఈ పథకం నమోదు కోసం మండలంలోని అన్ని గ్రామపంచాయతీల పరిధిలో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

తెల్ల రేషన్ కార్డు కలిగి ఉండి, కుటుంబాన్ని పోషించే వ్యక్తి 18 నుంచి 59 సంవత్సరాల వయస్సు మధ్య ఉన్న కుటుంబాలు ఈ పథకానికి అర్హులని పేర్కొన్నారు. అర్హులైన వారు తమ గ్రామాల్లో ఏర్పాటు చేసిన శిబిరాలకు వెళ్లి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.దరఖాస్తు సమయంలో ఆహార భద్రత (రేషన్) కార్డు, ఆధార్ కార్డు, మొబైల్ నంబర్ తప్పనిసరిగా వెంట తీసుకురావాలని సూచించారు. అర్హులైన ప్రతి కుటుంబం ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల అధికారులు విజ్ఞప్తి చేశారు.

బీఆర్ఎస్ నాయకులవి ఉనికి కోసం దొంగ నాటకాలు



- **40 మంది చేరారంటూ తప్పుడు ప్రచారం..**
- **టేకుమట్ల నుంచి వెళ్లింది ఇద్దరే**
- **కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తిప్పిరెడ్డి కృష్ణారెడ్డి**

(టేకుమట్ల, జోర్దార్ ప్రతినిధి)బీఆర్ఎస్ నాయకులు రాజకీయ ఉనికి కాపాడుకోవడం కోసమే దొంగ నాటకాలకు తెరలేపుతున్నారని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తిప్పిరెడ్డి కృష్ణారెడ్డి విమర్శించారు. కేటీఆర్ సమక్షంలో 40 మంది కాంగ్రెస్ కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరినట్లు ప్రకటించడం మాజీ ఎమ్మెల్యే గంద్ర వెంకటరమణారెడ్డి దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమన్నారు. వాస్తవానికి టేకుమట్ల మండలం నుంచి చేరింది కేవలం ఇద్దరు వ్యక్తులేనని, వారు కూడా గతంలో బీఆర్ఎస్‌కు చెందినవారేనని స్పష్టం చేశారు. వారికి కాంగ్రెస్ సభ్యత్వం లేదని, పార్టీతో ఎలాంటి సంబంధం లేదని, ఎమ్మెల్యే గంద్ర సత్యనారాయణరావు గెలుపులోనూ వారి పాత్ర లేదన్నారు. వ్యక్తిగత అవసరాల కోసం ఎమ్మెల్యే సహకారం తీసుకున్నంత మాత్రాన వారు కాంగ్రెస్ నాయకులు కాదని పేర్కొన్నారు. నియోజకవర్గంలో బీఆర్ఎస్ అంతర్గత విభేదాలను కప్పిపుచ్చుకోవడంతో పాటు కేటీఆర్ పద్ద మెప్పు పొందేందుకే గంద్ర వెంకట రమణారెడ్డి ఇలాంటి తప్పుడు ప్రచారానికి దిగుతున్నారని ఆరోపించారు. ప్రజలన్నీ గమనిస్తున్నారని, ఇలాంటి ప్రకటనలను నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరన్నారు. ఎమ్మెల్యే గంద్ర సత్యనారాయణ రావు నియోజకవర్గ అభివృద్ధి కోసం రోజుకు 18 గంటలు శ్రమిస్తూ ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వానికి, ఎమ్మెల్యేకు ప్రజల్లో పెరుగుతున్న ఆదరణను చూసి ఓర్వలేకనే బీఆర్ఎస్ నాయకులు ఇలాంటి ప్రచారాలు చేస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు కత్తి సంపత్, వెల్లంపల్లి సర్పంచ్ కూర వెంకటరాజిరెడ్డి, పెరుమాండ్ల మొగిలి, గునిగంటి మహేందర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కనుమరుగుల సంపత్, వరికెల కిష్టరావు, వంగ నరేష్, అంబాల రమేష్, కనుమరుగుల సదయ్య, చెక్క ఓదేలు తదితరులు పాల్గొన్నారు.

మధిర ఏరియా ఆస్పత్రిలో నలుగురు డాక్టర్లు సస్పెన్షన్

జోర్దార్ దినపత్రిక ఖమ్మం జిల్లా స్టాఫ్ రిపోర్టర్:: విధుల పట్ల నిర్లక్ష్యం, సమయపాలన పాటించకపోవడంపై మధిర ఏరియా ఆసుపత్రికి చెందిన నలుగురు డాక్టర్లను ఉన్నత అధికారులు సస్పెండ్ చేశారు. ఈ నెల 19న నిర్వహించిన సమావేశంలో వైద్యులు, సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటించాలని, నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించినప్పటికీ మరుసటి రోజైన నవంబర్ 20న నిర్దేశిత సమయానికి విధులకు హాజరుకాకపోవడాన్ని అధికారులు తీవ్రంగా పరిగణించారు. జిల్లా కలెక్టర్ దివాకర ఆదేశాల మేరకు తెలంగాణ సివిల్ సర్వీసెస్ (సీసీఏ) నిబంధనలు– 1991లోని రూల్ 8(1)(ఎ) ప్రకారం నలుగురిని తక్షణమే సస్పెండ్ చేశారు. సస్పెన్షన్‌కు గురైన వారిలో డిప్యూటీ సివిల్ సర్జన్ డాక్టర్ కె. అనిల్ కుమార్ (జనరల్ మెడిసిన్), డాక్టర్ డి. శ్రీను (పిడియాట్రిక్స్), డాక్టర్ ఎం. వెంకటేశ్వర్లు (ఆర్థోపెడిక్స్), డాక్టర్ పి. శ్రీకాంత్ (రేడియాలజీ) ఉన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని డిసిహెచ్ఎస్ డాక్టర్ రాజశేఖర్ గౌడ్ స్పష్టం చేశారు. వైద్యులు, సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని హెచ్చరించారు.

యాసంగిలో ఆరుతడి పంటలే మేలు

రైతులకు వ్యవసాయ శాఖ సూచన

● ఆత్మ ఆధ్వర్యంలో పాలంబడి, క్షేత్రదినోత్సవం



(టేకుమట్ల జోర్దార్ ప్రతినిధి)యాసంగి సీజన్‌లో నీటి ఎద్దడి అవకాశాలను దృష్టిలో ఉంచుకుని రైతులు వరి సాగును తగ్గించి, తక్కువ నీటితో సాగు చేసుకునే ఆరుతడి పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలని మండల వ్యవసాయాధికారి ఎం. కళ్యాణి సూచించారు. ఈరోజు రాజకృష్ణాపూర్ (టి) గ్రామంలో ఆత్మ ఆధ్వర్యంలో వరి పంటపై పొలంబడి, క్షేత్రదినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరి పంటలో సమగ్ర పోషక యాజమాన్యం, ఎరువుల వినియోగం, ఆధునిక వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. వరి కోతల అనంతరం పంట కొయ్యలను కాల్చకుండా పొలంలోనే కలియదున్నడం వల్ల నేలలో సేంద్రియ కర్బనం పెరిగి భూసారం మెరుగుపడుతుందని వివరించారు. యాసంగిలో ఎల్‌నినో ప్రభావంతో నీటి ఎద్దడి ఏర్పడే అవకాశం ఉన్నందున నీటి లభ్యతను బట్టి పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. ఆరుతడి పంటలు, కూరగాయలు, చిరుధాన్యాలు, పశుగ్రాస పంటల సాగును ప్రోత్సహించాలని తెలిపారు. పంటల మార్పిడిని ప్రోత్సహించేందుకు వరి మినహా ఇతర పంటల విత్తనాలను సబ్సిడీపై అందుబాటులోకి తీసుకురానున్నట్లు వెల్లడించారు. డ్రిప్, స్ప్రింక్లర్ వంటి సూక్ష్మ సేద్య పద్ధతులను వినియోగించుకుని నీటిని పొదుపుగా వాడుకోవాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గునిగంటి రజని మహేందర్, ఉపసర్పంచ్ కొడగాని నవీన్, వ్యవసాయ విస్తరణ అధికారులు జి. కళ్యాణి, పి.

సమాచార హక్కు చట్టంపై

ప్రజల్లో విస్తృత ప్రచారం చేపట్టాలి



● అవినీతి నిర్మూలనలో ఆర్టీఐ కీలక పాత్ర.

● ప్రభుత్వ పాలనలో పారదర్శకత పెంపొందించడానికి, అవినీతినిమంచిర్యాలలో సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సు

● ప్రజాస్వామ్య పరిరక్షణకు, ప్రభుత్వ పాలనలో పారదర్శకతకు ఆర్టీఐ చట్టం ఎంతో కీలకం

● ముఖ్య అతిథిగా సమాచార హక్కు వికాస సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ యర్రమాధ కృష్ణారెడ్డి

మంచిర్యాల:ప్రజలకు ప్రభుత్వ పాలనలో పారదర్శకత, జవాబుదారీతనం కల్పించడంతో పాటు ప్రభుత్వ కార్యాలయాల్లో జరిగే కార్యకలాపాలపై సమాచారం తెలుసుకునే హక్కును ప్రతి పౌరుడికి అందించిన సమాచార హక్కు చట్టం పై ప్రజల్లో మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని సమాచార హక్కు వికాస సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ యర్రమాధ కృష్ణారెడ్డి అన్నారు.
మంచిర్యాల జిల్లా కేంద్రంలోని లయన్స్ క్లబ్‌లో సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సును నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ యర్రమాధ కృష్ణారెడ్డి హాజరై, సమాచార హక్కు చట్టం ఉద్దేశాలు, లక్ష్యాలు, చట్టం ద్వారా ప్రజలకు కలిగే ప్రయోజనాలు, చట్టాన్ని ఉపయోగించుకునే విధానాలపై సమగ్రంగా వివరించారు.

సమాచార హక్కు చట్టం సామాన్య పౌరుడికి లభించిన ఒక శక్తివంతమైన ప్రజాస్వామ్య ఆయుధమని, ప్రభుత్వ శాఖలు, ప్రభుత్వ కార్యాలయాల్లో జరిగే పరిపాలనా వ్యవహారాలు, అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలు, నిధుల వినియోగం తదితర అంశాలపై ప్రజలు చట్టబద్ధంగా సమాచారాన్ని కోరవచ్చని వివరించారు.ఈ సదస్సులో సమాచార హక్కు చట్టానికి సంబంధించిన పలు ముఖ్యమైన అంశాలను వివరించి, చట్టాన్ని ప్రజా ప్రయోజనాల కోసం బాధ్యతాయుతంగా ఎలా వినియోగించుకోవాలో అవగాహన కల్పించారు.రాష్ట్ర మహిళా కమిటీ సభ్యులు వైహేమలత,పాల్గొన్న వారిలో మంచిర్యాల, జగిత్యాల, ఆసిఫాబాద్, పెద్దపల్లి జిల్లా సభ్యులు, ఉప్పుల రామకిషన్, కాసార్ల శ్రీనివాస్,సుంకరి బుజంగ రావు, ఐలేని రాజేశ్వర్ రెడ్డి ,యన్. తిరుపతి,ఆదినారాయణ, అవినాష్,చిందం మల్లేష్, యోసేప్, తిరుపతి, వెంకటస్వామి, హన్మకొండ సందీప్,తదితరులు పాల్గొన్నారు. అరికట్టడానికి, ప్రజాధనం దుర్వినియోగం కాకుండా పర్యవేక్షించడానికి సమాచార హక్కు చట్టం ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

ప్రేమించి పెళ్లి చేసుకుంటానని మోసం

చేసిన వ్యక్తితో పెళ్లి జరిపించాలి

● న్యాయపోరాటం చేస్తున్న యువతి నిరాహార దీక్ష.




బెల్లంపల్లి జోర్దార్ ప్రతినిధి:మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలం అంకుశం గ్రామానికి చెందిన ఎల్లమద్రి అనిత, దండేపల్లి మండలం లింగాపూర్ గ్రామానికి చెందిన పాత్తే గౌతమ్,తో గత రెండు సంవత్సరాలుగా పరిచయం ఏర్పడిందని, ఆ పరిచయం ప్రేమగా మారిందని యువతి తెలిపింది. ఇద్దరం ప్రేమించుకున్నామని, ప్రస్తుతం తనను వివాహం చేసుకోవడానికి గౌతమ్ నిరాకరిస్తున్నాడని అనిత ఆరోపిస్తోంది. రెండేళ్లుగా ప్రేమించి, పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఇప్పుడు వివాహానికి నిరాకరించడంతో తనకు అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేస్తోంది, తనకు న్యాయం చేయాలని కోరుతూ దండేపల్లి మండలం లింగాపూర్ గ్రామంలోని పాత్తే గౌతమ్ ఇంటి ముందు అనిత నిరాహార దీక్ష చేపట్టింది.

కులాంతర ప్రేమ వ్యవహారంలో న్యాయం కోసం పోరాటం.

తాను ఎస్సీ మాల సామాజిక వర్గానికి చెందిన యువతినని, యువకుడు లంబాడీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిని పేర్కొంటూ, కులాలతో సంబంధం లేకుండా తనకు గౌతమ్ తో పెళ్లి జరిపించాలని అనిత కోరుతోంది.

సంబంధిత అధికారులు, పోలీసు శాఖ స్పందించి ఇరువర్గాల వాదనలు విని సమగ్ర విచారణ జరిపి, చట్టప్రకారం తనకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేస్తోంది.తన సమస్యకు న్యాయబద్ధమైన పరిష్కారం లభించే వరకు పోరాటం కొనసాగిస్తానని యువతి హెచ్చరించింది.
యువతి ఆవేదనను అధికారులు గుర్తించి, వెంటనే స్పందించి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.


అటల్ టింకరింగ్ ల్యాబ్‌లో దొంగలు



(సిరిసిల్ల జోర్దార్ ప్రతినిధి)అది ఎల్లారెడ్డిపేట మండల కేంద్రం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అతిపెద్ద భవన సముదాయాన్ని నిర్మించి పిల్లలకు అన్ని తరగతులు, ల్యాబులు అందుబాటులో ఉండాలని కొన్ని కోట్ల ఖర్చుతో అద్భుతమైన రీతిలో నిర్మించింది. ప్రభుత్వ నిర్ణయం ప్రకారం అటల్ టింకరింగ్ ల్యాబ్ సాంక్షన్ కూడా అయింది. అయితే ఇక్కడే అదే పాఠశాలలో పనిచేస్తున్న ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయుల దృష్టి అటల్ టింకరింగ్ ల్యాబ్ నిధులపై పడింది. విద్యార్థులకి సాంకేతిక తను నేర్పించడానికి ప్రపంచంతో పోటీ పడడానికి ప్రభుత్వం ఆలోచించి కొన్ని లక్షల నిధులని పిల్లలలో సాంకేతికత అభివృద్ధి చేయడానికి మంజూరు చేస్తే ఇదే అదునుగా ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులైన దబ్బెడ హనుమాన్లు నిధులను ఖర్చు చేసినట్టు తప్పుడు బిల్లులు చూపి జేబులో వేసుకున్నాడు. పేద బడుగు బలహీన వర్గాల పిల్లల ఆశలు, ఆశయాలు చంపేస్తున్న ఇలాంటి వారిని ప్రశ్నించాలని ఇది తెలిసిన అప్పటి పాఠశాల చైర్మన్ ఆర్ టి ఐ ద్వారా నిధుల ఖర్చు వివరాలు అడగగా ఈ విషయం బయటికి చెప్పవద్దు అని రెండు లక్షలు ఆ చైర్మన్ గారికి ముట్టజెప్పి ఎవరికీ చెప్పవద్దని భేరసారాలు ఆడడం జరిగింది. ఇక పాఠశాలలో ఉన్న ఉపాధ్యాయులకి ఆడిందే ఆటగా పాడిందే పాటగా దావతుల మీద దావతులు ఇచ్చి వారి నోరులు కూడా నొక్కడం జరిగింది. ఇంత జరుగుతున్నా జిల్లా విద్యాశాఖ అతనిపై చర్యలు తీసుకున్న పాపాన పోలేదు. పిల్లలకి అందాల్సిన సాంకేతిక విద్యను అందకుండా చేసిన అవినీతిపరుడు ఇప్పుడు జిల్లా విద్యాశాఖలో సెక్టోరియల్ అధికారిగా బాధ్యతలు నిర్వర్తిస్తూ అడ్డగోలుగా బేరసారాలు నడుపుతున్నాడు. ఇదంతా అధికారులకు తెలిసే జరుగుతోందా లేక తెలియకుండా చేస్తున్నారా అనే ప్రశ్న ప్రశ్నార్థకంగా మారింది. సామాన్య మానవుడు చిన్న తప్పు చేస్తేనే అతిపెద్ద శిక్షలతో విరుచుకుపడే అధికారులు జిల్లాలో ఎన్ని తప్పులు జరుగుతున్నా ఎందుకు మీన మేసాలు లెక్కిస్తున్నారని సగటు తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లాలో విద్యాశాఖను గాడిన పెట్టాల్సిన అవసరం ఉందని, జిల్లా విద్యాశాఖ కార్యాలయాన్ని ప్రక్షాళన చేయాల్సిన సమయం ఆసన్నమైందని విద్యావేత్తలు కోరుతున్నారు.

చలికాలంలో రోజూ తగినంత నీళ్లను తాగాల్సిందే

నీరు తగ్గితే ఈ సమస్యలు వస్తాయి



శరీరంలో నీటి కొరత ఏర్పడకుండా చూడడమే కాదు, ఊపిరితిత్తుల ఆరోగ్యాన్ని కాపాడడంలోనూ నీరు కీలక పాత్ర పోషిస్తుంది. ముఖ్యంగా శ్వాసనాళాల లోపలి పొరపై ఉండే శ్లేష్మం తగినంత తేమతో ఉండేలా సహాయపడుతుంది. ఈ శ్లేష్మం గాలితోపాటు లోపలికి వచ్చే ధూళి, అలర్జీ కారకాలు, ఇతర హానికర కణాలను అడ్డుకుంటుంది.

చలికాలంలో దాహం తక్కువగా అనిపించడంతో చాలామంది నీరు తాగడం తగ్గిస్తారు. అయితే ఈ సమయంలో శ్వాసకోశ ఇన్ఫెక్షన్లు, వాతావరణ మార్పులు, వాయు కాలుష్యం వల్ల ఊపిరితిత్తులపై ఒత్తిడి పెరుగుతుంది. అందువల్ల తగినంత నీరు తీసుకోవడం మరింత అవసరం.

శ్లేష్మంతో ఉపయోగమేమిటి..?

శ్వాసనాళాల్లో ఉండే శ్లేష్మం కేవలం దగ్గు, జలుబు సమయంలో ఏర్పడే పదార్థం మాత్రమే కాదు. ఇది శరీరానికి సహజ రక్షణ కవచంలా పనిచేస్తుంది.

గాలితో లోపలికి వచ్చే ధూళి, సూక్ష్మజీవులు, కాలుష్య కణాలను పట్టుకుని ఉంచుతుంది. శ్వాసనాళాల్లో ఉండే వెంట్రుకల్లాంటి సన్నని నిర్మాణాలు ఈ శ్లేష్మాన్ని క్రమంగా గొంతు వైపు కదిలిస్తాయి. అక్కడి నుంచి అది మింగడం లేదా దగ్గడం ద్వారా బయటకు వెళ్తుంది. ఈ ప్రక్రియ సక్రమంగా జరగాలంటే శ్లేష్మం తగినంత పలుచగా, తేమతో ఉండాలి. శరీరంలో నీటి కొరత ఏర్పడితే అది చిక్కగా మారి బయటకు వెళ్లడం కష్టమవుతుంది. దీంతో శ్వాసకోశ సమస్యలు ఉన్నవారికి మరింత అసౌకర్యం కలుగుతుంది.

దాహం వేయకపోయినా నీళ్లను తాగాల్సిందే..

చలికాలంలో దాహం వేయకపోయినా క్రమం తప్పకుండా నీరు తాగాలి. శ్వాస, మూత్ర విసర్జన, చెమట ద్వారా శరీరం నిరంతరం నీటిని కోల్పోతుంది. జ్వరం, శ్వాసకోశ ఇన్ఫెక్షన్లు, కొన్ని మందుల వల్ల నీటి అవసరం పెరుగుతుంది. నీటితోపాటు సూప్‌లు, పులుసులు, పుచ్చకాయ, నారింజ, దోసకాయ, టమాటా వంటి నీటి శాతం ఎక్కువగా ఉండే ఆహారాలు కూడా ఉపయోగపడతాయి.

అయితే ఎక్కువ నీరు తాగడం వల్ల కాలుష్య ప్రభావం తొలగిపోదు. ఊపిరితిత్తుల్లోకి చేరిన కాలుష్య కణాలను నీరు బయటకు పంపలేదు. అందువల్ల గాలి నాణ్యత సూచనలు పాటించడం, కాలుష్యం ఎక్కువగా ఉన్నప్పుడు బయట వ్యాయామం తగ్గించడం, పొగకు దూరంగా ఉండడం, ఇంటి గాలి నాణ్యతను మెరుగుపరచడం అవసరం.

రోజుకు ఎంత నీరు తాగాలి..

ఊపిరితిత్తుల ఆరోగ్యానికి రోజుకు ఎంత నీరు తాగాలనే ప్రత్యేక పరిమాణం లేదు. వయసు, శరీర బరువు, శారీరక శ్రమ, వాతావరణం, ఆరోగ్య పరిస్థితులను బట్టి నీటి అవసరం మారుతుంది. దాహం వేసే వరకు వేచి ఉండకుండా రోజంతా కొద్దికొద్దిగా నీరు తాగాలి. గుండె లేదా మూత్రపిండాల సమస్యలతో నీటిని పరిమితంగా తీసుకోవాల్సినవారు వైద్యుల సూచన పాటించాలి. నిరంతర దగ్గు, ఆయాసం, అధిక కఫం, పిల్లికూతలు వంటి లక్షణాలు ఉంటే వైద్యులను సంప్రదించాలి. ఉబ్బసం, దీర్ఘకాలిక ఊపిరితిత్తుల వ్యాధులు ఉన్నవారు సూచించిన మందులను కొనసాగించాలి.

తగినంత నీరు తాగడంతోపాటు వ్యాయామం, టీకాలు, కాలుష్య నివారణ, పొగకు దూరంగా ఉండడం కూడా ఊపిరితిత్తుల ఆరోగ్యానికి అవసరమని నిపుణులు చెబుతున్నారు

న్యుమోనియా అంటే ఏమిటి.. లక్షణాలు ఎలా ఉంటాయి.. తగ్గేందుకు ఏం చేయాలి..?



న్యుమోనియా అంటే కేవలం దగ్గు, జ్వరం మాత్రమే కాదు. ఇది ఊపిరితిత్తులకు సోకే ఇన్ఫెక్షన్. దీని వల్ల ఊపిరితిత్తులు సాధారణంగా పనిచేయవు. సరైన సమయంలో చికిత్స అందకపోతే ప్రాణాపాయ పరిస్థితి ఏర్పడే ప్రమాదం ఉంటుంది. ముఖ్యంగా లక్షణాలు మొదలైన తొలి 24 గంటల్లోనే వ్యాధిని గుర్తించడం చాలా ముఖ్యం. ఎందుకంటే ఈ ఇన్ఫెక్షన్ కారణంగా ఊపిరితిత్తుల్లో చీము, ద్రవం పేరుకుపోయి రక్తంలోకి తగినంత ఆక్సిజన్ చేరకుండా అడ్డుకుంటాయి. అందువల్ల న్యుమోనియా అనుమానం వచ్చినప్పుడు ఆలస్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలి.

న్యుమోనియా లక్షణాలు ఎలా ఉంటాయి..?

న్యుమోనియా వచ్చినప్పుడు వేగంగా శ్వాస తీసుకోవడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, ఛాతి నొప్పి, తీవ్రమైన అలసట వంటి లక్షణాలు కనిపిస్తాయి. కొందరిలో గందరగోళం, మగత, పెదవులు లేదా గోళ్లు నీలం రంగులోకి మారడం కూడా ప్రమాద సంకేతాలు. ముఖ్యంగా శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఉంటే వెంటనే వైద్య సహాయం పొందాలి. ప్రతి ఒక్కరిలో లక్షణాలు ఒకేలా ఉండవు. వృద్ధులకు న్యుమోనియా వచ్చినప్పటికీ కొన్నిసార్లు జ్వరం కనిపించదు. పిల్లల్లో పాలు లేదా ఆహారం సరిగ్గా తీసుకోకపోవడం, అసాధారణంగా చిరాకు పడడం, చురుకుదనం తగ్గడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటి లక్షణాలు కనిపిస్తాయి. వృద్ధుల్లో అకస్మాత్తుగా గందరగోళం, బలహీనత లేదా రోజువారీ పనులు చేసుకునే సామర్థ్యం తగ్గడం వంటి లక్షణాలు కనిపిస్తాయి.

వైద్య పరీక్షలు చేయించాలి..

లక్షణాలు కనిపించిన తొలి 24 గంటల్లో వైద్య పరీక్షలు చేయించుకోవడం వల్ల వ్యాధి తీవ్రతను అంచనా వేయవచ్చు.

రోగిని ఆసుపత్రిలో చేర్చాలా లేదా ఇంటి వద్ద చికిత్స అందించవచ్చా అనే విషయాన్ని వైద్యులు నిర్ణయిస్తారు. ఇందుకోసం రక్తపోటు, రక్తంలో ఆక్సిజన్ స్థాయి, శ్వాస వేగం, గుండె కొట్టుకునే వేగం వంటి అంశాలను పరిశీలిస్తారు. అవసరాన్ని బట్టి శారీరక పరీక్షలు, రక్తపరీక్షలు నిర్వహిస్తారు.

రోగి వయసు, ఇతర ఆరోగ్య సమస్యలు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, స్పృహ స్థాయి, ఆక్సిజన్ స్థాయి ఆధారంగా ఆసుపత్రిలో చేర్చాలా వద్దా అనేది నిర్ణయిస్తారు. న్యుమోనియా బ్యాక్టీరియా, వైరస్ లేదా కొన్ని సందర్భాల్లో ఫంగస్ వల్ల వస్తుంది.


బ్యాక్టీరియా వల్ల వచ్చిన న్యుమోనియాకు యాంటీబయాటిక్ మందులు ఉపయోగపడతాయి. వైరస్ వల్ల వచ్చిన న్యుమోనియాకు యాంటీ బయాటిక్స్ పనిచేయవు. ఇతరులు వాడిన యాంటీబయాటిక్ మందులను సొంతంగా తీసుకోవడం వల్ల సరైన చికిత్స ఆలస్యం కావడమే కాకుండా మందులను తట్టుకునే బ్యాక్టీరియా పెరిగే ప్రమాదం ఉంటుంది.

మందులను వాడాలి..

వైద్యులు సూచించిన మందులను క్రమం తప్పకుండా వాడుతూ, నిర్ణయించిన సమయానికి తిరిగి పరీక్ష చేయించుకోవాలి. శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పెరగడం, గందరగోళం, జ్వరం లేదా ఆరోగ్య పరిస్థితి మరింత దిగజారడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి. వృద్ధులు, ఇతర దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు ఉన్నవారు మరింత అప్రమత్తంగా ఉండాలి. సరైన చికిత్స అందకపోతే న్యుమోనియా వల్ల శ్వాసకోశ వైఫల్యం వస్తుంది. ఇన్ఫెక్షన్ రక్తంలోకి వ్యాపించే ప్రమాదం కూడా ఉంటుంది. దగ్గు ఎక్కువగా ఉండి, జ్వరం లేకపోయినా తీవ్రమైన అలసట లేదా శ్వాస సమస్యలు ఉంటే నిర్లక్ష్యం చేయకూడదు. పిల్లలు, వృద్ధుల్లో లక్షణాలు సాధారణంగా కనిపించవు, కాబట్టి కుటుంబ సభ్యులు ప్రత్యేక శ్రద్ధ చూపాలి.
శ్వాస సంబంధిత ఇబ్బందులు కనిపించినప్పుడు వైద్య సహాయం పొందడంలో ఆలస్యం చేయకపోవడమే న్యుమోనియా వల్ల వచ్చే తీవ్రమైన సమస్యలను నివారించడంలో కీలకమని నిపుణులు సూచిస్తున్నారు

లివర్‌ను క్లీన్ చేస్తాయని చెప్పే చిట్కాలు, ఉత్పత్తులను నమ్మవచ్చా

కాఫీ ప్రభావం లివర్‌పై ఉంటుందా..?



రక్తంలోని హానికర పదార్థాలను తొలగించడం నుంచి ఆహారం జీర్ణం కావడానికి సహాయపడడం వరకు కాలేయం శరీరంలో ఎన్నో కీలకమైన విధులను నిర్వహిస్తుంది. అందుకే కాలేయ ఆరోగ్యాన్ని కాపాడుకోవడం చాలా ముఖ్యం. ఇందుకోసం ఏదో ఒక ప్రత్యేక ఆహారాన్ని తీసుకోవడం లేదా ప్రత్యేక ఆహార నియమాలను పాటించడం మాత్రమే సరిపోదు. రోజువారీ ఆహారపు అలవాట్లు, ఆరోగ్యకరమైన జీవనశైలి దీర్ఘకాలంలో కాలేయ ఆరోగ్యంపై ప్రభావం చూపుతాయి. కొన్ని ఆహార పదార్థాలు కాలేయాన్ని శుభ్రం చేస్తాయని, దెబ్బతిన్న కాలేయాన్ని తిరిగి బాగు చేస్తాయని ప్రచారం జరుగుతున్నా, ఇలాంటి వాదనలన్నీ నిజం కావని నిపుణులు చెబుతున్నారు.

డీటాక్స్ ఉత్పత్తులను నమ్మవచ్చా..?

కాలేయాన్ని శుభ్రం చేస్తాయంటూ ప్రచారం చేసే డీటాక్స్ టీలు, క్లెన్సింగ్ పానీయాలను నమ్మవద్దని వారు చెబుతున్నారు. కాలేయానికి ప్రత్యేకంగా డీటాక్స్ అవసరం లేదని, శరీరంలోని హానికర పదార్థాలను తొలగించే పని కాలేయమే చేస్తుందని వివరించారు. మరోవైపు బ్లాక్ కాఫీ కాలేయ ఆరోగ్యానికి చాలా మంచిదని దీనిని క్రమం తప్పకుండా కాఫీ తాగడం వల్ల కాలేయంలో మచ్చలు, గట్టిపడడం తగ్గడంతోపాటు కాలేయ క్యాన్సర్ వచ్చే ప్రమాదం కూడా తగ్గే అవకాశం ఉంటుందని తెలిపారు. బరువులతో వ్యాయామం చేయడం కూడా కాలేయ ఆరోగ్యానికి మంచిదని సూచించారు. ఇలాంటి బలవర్ధక వ్యాయామాలు ఇన్సులిన్ పట్ల శరీర స్పందనను మెరుగుపరచి కాలేయంలో కొవ్వు పేరుకుపోవడాన్ని తగ్గించడంలో సహాయపడతాయని పేర్కొన్నారు.

ప్రోటీన్లు మనకు రోజూ ఎంత అవసరం..?

శరీర బరువులో ప్రతి కిలోకు రోజుకు సుమారు 1.2 నుంచి 1.6 గ్రాముల ప్రొటీన్లు తీసుకోవాలని సూచించారు. రోజుకు 30 గ్రాముల పీచు పదార్థాలు తీసుకోవడం కూడా అవసరమని తెలిపారు. ఇవి రక్తంలో చక్కెర, కొలెస్ట్రాల్ స్థాయిలను నియంత్రించడంలో, కడుపు నిండిన భావన కలిగించడంలో, పేగుల్లోని మంచి సూక్ష్మజీవుల ఆరోగ్యాన్ని కాపాడడంలో తోడ్పడతాయి. బరువు తగ్గించడంలో, ఫ్యాటీ లివర్ సమస్యను మెరుగుపరచడంలో సహాయపడే జీఎల్‌పీ-1 మందులను వైద్యుల పర్యవేక్షణలోనే వాడాలని స్పష్టం చేశారు. ఫ్యాటీ లివర్‌కు అశ్వగంధ మందులు నిరూపితమైన చికిత్స కాదని, అరుదైన సందర్భాల్లో కాలేయానికి హాని కలిగించినట్లు నివేదికలు ఉన్నాయని హెచ్చరించారు.

ఆరోగ్యకరమైన అలవాట్లను పాటించాలి..

పేగుల ఆరోగ్యాన్ని దెబ్బతీసే కొన్ని సాధారణ అలవాట్ల గురించి కూడా నిపుణులు వివరించారు. మరుగుదొడ్డిలో ఎక్కువసేపు ఫోన్ చూస్తూ కూర్చోవడం వల్ల అక్కడ గడిపే సమయం పెరిగి మూలవ్యాధి సమస్య వచ్చే ప్రమాదం ఉంటుంది. మల విసర్జన సమయంలో మరీ గట్టిగా ఒత్తిడి పెట్టడం కూడా ఈ సమస్యను తీవ్రతరం చేస్తుంది. పీచు పదార్థాలు పుష్కలంగా ఉండే బీన్స్, ఇతర పప్పుధాన్యాలను ఆహారం నుంచి పూర్తిగా తొలగించకూడదు. ఇవి మంచి పేగు బ్యాక్టీరియా పెరుగుదలకు, మల విసర్జన సక్రమంగా జరగడానికి సహాయపడతాయి. పెద్దపేగు క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గించడంలోనూ తోడ్పడతాయి. ప్రతిరోజూ మల విసర్జన అవుతోందని మాత్రమే జీర్ణక్రియ ఆరోగ్యంగా ఉందని భావించకూడదు. గట్టిగా ఉండే మలం, విసర్జనలో ఇబ్బంది, కడుపు పూర్తిగా ఖాళీ కాలేదనే భావన మలబద్ధకానికి సంకేతాలు అవుతాయి. ఇబుప్రోఫెన్, నాప్రోక్సెన్ వంటి నొప్పి నివారణ మందులను వాడడం వల్ల కడుపులో పుండ్లు, రక్తస్రావం వచ్చే ప్రమాదం కూడా ఉంటుందని నిపుణులు హెచ్చరించారు

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం పేద కుటుంబాలకు అండ



రుద్రంపూర్:కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని 15వ డివిజన్‌లో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ ఆకునూరి సుప్రియ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోందని తెలిపారు. కుటుంబాలకు కష్టకాలంలో రూ.5 లక్షల ఆర్థిక భరోసా కల్పించడంలో ఈ పథకం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు ఆఫీసర్ శ్రీకాంత్, శివరామ్, రాకటి ప్రభాకర్ రావు, కంప్యూటర్ ఆపరేటర్ అబ్దుల్ గౌస్, ఆర్‌పీలు శిరీష, సునీత పాల్గొన్నారు

దిల్లీ క్యాపిటల్స్‌కు మహేల జయవర్ధనే.. తొలి టైటిల్ సాధించేనా..!

శ్రీలంక స్టార్ క్రికెటర్ మహేల జయవర్ధనే 13 ఏళ్ల విరామం తర్వాతమళ్లీ ఢిల్లీ ఫ్రాంచైజీ లోకిఅడుగుపెడుతున్నారు. గతంలో 2012, 2013 సీజన్లలో ఆయన ఢిల్లీ డేర్‌డెవిల్స్ తరఫున ఆడటంతో పాటు కెప్టెన్‌గా కూడా వ్యవహరించారు. గత సీజన్ వరకు ముంబై ఇండియన్స్ టీంకు హెడ్ కోచ్‌గా పని చేసి మూడు ఐపీఎల్ టైటిళ్లు(2017, 2019, 2020) నెగ్గడంలో కీలక పాత్ర పోషించారు. నేడు మహేలను ఢిల్లీ క్యాపిటల్స్ తమ వుమెన్ ప్రీమియర్ లీగ్ జట్టుకు 'డైరెక్టర్ ఆఫ్ క్రికెట్'గా నియమించింది. జట్టు వ్యూహం, ప్రతిభను గుర్తించడం, ఆటగాళ్లు, కోచింగ్ సిబ్బంది అభివృద్ధి'తో సహా ఫ్రాంచైజీకి సంబంధించిన అన్ని క్రికెట్ విషయాలను జయవర్ధనే పర్యవేక్షిస్తారని ఫ్రాంచైజీ ఒక ప్రకటనలో



ధృవీకరించింది. 2027 డబ్ల్యూపీఎల్ సీజన్‌కు ముందు ఢిల్లీ క్యాపిటల్స్ ఫ్రాంచైజీ ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించింది. ఇప్పటివరకు డబ్ల్యూపీఎల్ లో నాలుగుసార్లు రన్నరప్‌గా నిలిచిన ఢిల్లీ క్యాపిటల్స్, మెన్స్ ఐపీఎల్‌లో తొలి టైటిల్ చుకోనుంది.

కివీస్‌కు దీటుగా జవాబిస్తున్న టీమిండియా.. రెండో రోజు ఆట ముగిసే సమయానికి స్కోర్ ఎంతంటే..



న్యూజిలాండ్‌తో జరుగుతున్న తొలి టెస్ట్‌లో టీమిండియా దీటుగా బదులిస్తోంది. తొలి ఇన్నింగ్స్‌లో న్యూజిలాండ్ 368 పరుగులకు అలౌటవ్వగా.. రెండో రోజు ఆట ముగిసే సమయానికి భారత్ 39 ఓవర్లలో ఒక వికెట్ కోల్పోయి 159 పరుగులు చేసింది. కేఎల్ రాహుల్ అర్ధశతకంతో క్రీజులో నిలవగా.. యశస్వి జైస్వాల్ శతకానికి చేరువగా వచ్చి వెనుదిరిగాడు. దేవదత్ పడిక్కల్ మరో ఎండ్‌లో ఉన్నాడు. న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్‌లో చేసిన 368 పరుగుల కంటే భారత్ ఇంకా 209 పరుగులు వెనుకబడి ఉంది.

368 పరుగుల లక్ష్యంతో తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన భారత్‌కు ఓపెనర్లు జైస్వాల్, రాహుల్ శుభారంభం అందించారు. న్యూజిలాండ్ పేసర్లను సమర్థంగా ఎదుర్కొంటూ తొలి వికెట్‌కు 125 పరుగులు జోడించారు. జైస్వాల్ దూకుడుగా ఆడుతూ బౌండరీలతో అలరించగా.. రాహుల్ ఆచితూచి బ్యాటింగ్ చేశాడు. ఈ క్రమంలో వీరిద్దరూ అర్ధశతకాలు సాధించారు. భారత్ టెస్టు చరిత్రలో 17 మ్యాచ్‌లు, 30 ఇన్నింగ్స్‌ల తర్వాత తొలి వికెట్‌కు శతక భాగస్వామ్యం నమోదైంది.

ధాటిగా ఆడిన జైస్వాల్ 89 బంతుల్లో 16 ఫోర్లతో 85 పరుగులు చేసి ఔటయ్యాడు. మాట్ హెన్రీ బౌలింగ్‌లో టామ్ బ్లండెల్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. అనంతరం క్రీజులోకి వచ్చిన పడిక్కల్.. రాహుల్‌తో కలిసి మరో వికెట్ పడకుండా జాగ్రత్తగా ఆడాడు. రాహుల్ 116 బంతుల్లో ఐదు ఫోర్లతో 52 పరుగులు చేయగా.. పడిక్కల్ 35 బంతుల్లో మూడు ఫోర్లతో 16 పరుగులు చేశాడు. రెండో రోజు ఆట ముగిసే సమయానికి భారత్ స్కోరు 39 ఓవర్లలో 159/1గా ఉంది.రాహుల్ ఖాతాలో అరుదైన ఘనతఈ అర్ధశతకంతో కేఎల్ రాహుల్ అరుదైన ఘనత సాధించాడు. దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా, తొలి ఓపెనర్‌గా నిలిచాడు

ఏ క్రికెటర్‌పైనా గంభీర్‌కు కోపం లేదు : కోచ్ సంజయ్ భరద్వాజ్

మహమ్మద్ సిరాజ్ ముస్లిం కావడం వల్లే న్యూజిల్యాండ్‌తో మొదటి టెస్టు మ్యాచ్‌లో అతడిని దూరం పెట్టారని కాంగ్రెస్ ఎంపీ ఇమ్రాన్ మసూద్ చేసిన వ్యాఖ్యలపై టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ చిన్ననాటి కోచ్ సంజయ్ భరద్వాజ్ స్పందించారు. సిరాజ్‌ను పక్కన పెట్టడం వెనుక మతానికి సంబంధించి ఎలాంటి కోణం లేదని ఆయన అన్నారు. శుక్రవారం ఓ వార్తా సంస్థతో ఆయన మాట్లాడారు. సిరాజ్ విషయంలో హిందూ ముస్లిం కోణం లేదన్నారు. జట్టు అవసరాలు, కాంబినేషన్‌ను దృష్టిలో ఉంచుకొని టీం సెలెక్షన్ ఉంటుందన్నారు. సిరాజ్‌కు గంభీర్ ఎప్పుడూ అండగా నిలిచాడని, ఏ ఆటగాడిపైనా అతనికి కోపం లేదన్నారు. బలమైన జట్టు నిర్మాణమే



హెడ్ కోచ్ ప్రాధాన్యమని పేర్కొన్నారు. 'సిరాజ్ విషయంలో వస్తున్న వార్తలన్నీ నిరాధారం. జట్టులో ప్రతిఒక్కరూ ఇండియనే. వారంతా దేశానికి ప్రాతినిధ్యం వహిస్తారు. సిరాజ్‌కు గంభీర్ ఎప్పుడూ సపోర్ట్‌గా ఉన్నాడు. జట్టు పరిస్థితి, ఆటగాళ్ల ప్రదర్శనల ఆధారంగా ఎంపిక ఉంటుంది' అని భరద్వాజ్ వ్యాఖ్యానించారు. అలాగే, బ్యాటింగ్ కోచ్ సితాన్షు కోటక్ కూడా జట్టు యాజమాన్యం నిర్ణయాన్ని సమర్థించాడు. కాగా.. సిరాజ్ ముస్లిం అయినందువల్లే అతడిని పక్కన పెట్టారని కాంగ్రెస్ ఎంపీ ఇమ్రాన్ మసూద్ అంతకుముందు వ్యాఖ్యానించారు. ప్రస్తుతం జరుగుతున్న వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్ సైకిల్‌లో అత్యధిక వికెట్లు తీసిన భారత ఆటగాడు సిరాజ్‌ను న్యూజిల్యాండ్‌తో మొదటి టెస్టుకు దూరం పెట్టడంపై జట్టు యాజమాన్యంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

భారత్ జట్టులో సిరాజ్‌కు చోటు దక్కకపోవడంపై రాజకీయ దుమారం..!



న్యూజిలాండ్‌తో జరుగుతున్న తొలి టెస్టు తుది జట్టులో పేసర్ మహ్మద్ సిరాజ్?కు చోటు దక్కని సంగతి తెలిసిందే. సిరాజ్‌తో పాటు జడేజా విషయంలో టీమిండియా సెలక్టర్లు తీసుకున్న ఈ నిర్ణయంపై సునీల్ గవాస్కర్, రవిశాస్త్రి లాంటి మాజీ క్రికెటర్లు సైతం అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇక సిరాజ్‌కు జట్టులో చోటు దక్కకపోవడం క్రికెట్ నుంచి రాజకీయ అంశంగా మారింది. ప్రస్తుతం సిరాజ్ విషయంలో కాంగ్రెస్, బీజేపీల మధ్య మాటల తూటాలు పేలుతున్నాయి. గతంలో అద్భుత ప్రదర్శన చేసినప్పటికీ, అతడి పేరు కారణంగానే జట్టులోకి తీసుకోలేదంటూ కాంగ్రెస్ ఎంపీ ఇమ్రాన్ మసూద్ సంచలన ఆరోపణలు చేశారు. 'మంచి ప్రదర్శన ఉన్నా జట్టులో చోటు ఇవ్వలేదంటే వివక్ష స్పష్టంగా కనిపిస్తోంది' అని ఆయన విమర్శించారు. ఇమ్రాన్ మసూద్ వ్యాఖ్యలపై బీజేపీ తీవ్రంగా స్పందించింది. క్రికెట్ జట్టు ఎంపికలోనూ కాంగ్రెస్ ఓటు బ్యాంకు, మత రాజకీయాలు చేస్తోందని బీజేపీ ప్రతినిధి ప్రదీప్ భండారీ మండిపడ్డారు. సిరాజ్ మైనారిటీ కావడం వల్లే పక్కనపెట్టారని కాంగ్రెస్ అంటోంది. మరి జడేజాను కూడా పక్కనపెట్టారు కదా!. మరి..దీనికి ఏం చెబుతారు. ప్రతి ఆటగాడు దేశం కోసం ఆడతాడు. రాజకీయాల కోసం జట్టును విభజించడం సిగ్గుచేటు' అని భండారీ సోషల్ మీడియా వేదికగా నిప్పులు చెరిగారు.మరోవైపు వెల్లింగ్టన్ టెస్టులో జస్ప్రీత్ బుమ్రాతో పాటు అన్షుల్ కాంబోజ్, ప్రసిద్ధ్ కృష్ణ, ఆకాశ్ దీప్‌లకు అవకాశం ఇవ్వడాన్ని టీమిండియా సహాయ కోచ్ సితాంశు కోటక్ సమర్థిం చుకు న్నారు. పిచ్ పరిస్థితులు, మ్యాచ్ అన్ని రోజుల వ్యూహాన్ని దృష్టిలో ఉంచుకునే అత్యుత్తమ తుది జట్టును ఎంపిక చేశామని, సిరాజ్ విషయంలో ఎలాంటి పొరపాటు జరగలేదని ఆయన స్పష్టం చేశారు.

హమ్మయ్య గెలిచాం.. రెండేళ్ల తర్వాత టెస్ట్ సిరీస్ కైవసం చేసుకున్న పాక్..!

రావల్పిండి వేదికగా శ్రీలంకతో జరిగిన రెండో టెస్ట్ మ్యాచ్‌లో పాకిస్థాన్ 8 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించి, 1-0తో టెస్ట్ సిరీస్‌ను కైవసం చేసుకుంది. ఈ విజయంతో రెండేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత పాకిస్థాన్ తన తొలి టెస్ట్ సిరీస్ గెలుపును నమోదు చేసింది. నాలుగో రోజు ఉదయం 90 పరుగుల స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన పాక్, నాలుగో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన ఆమర్ జమాల్ (34లి) మెరుపు ఇన్నింగ్స్, ఓపెనర్ అజాన్ అవైస్ (32లి) అజేయ బ్యాటింగ్‌తో కేవలం 13 ఓవర్లలోనే (90/2) లక్ష్యాన్ని ఛేదించింది.

కొత్త ముఖాలతో బరిలోకి దిగిన పాకిస్థాన్ క్రికెట్ జట్టు ఎట్టకేలకు రెండేళ్ల సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ టెస్ట్ సిరీస్ విజయాన్ని అందుకుంది. రావల్పిండి వేదికగా శ్రీలంకతో జరిగిన రెండో టెస్టులో 8 వికెట్ల తేడాతో గెలుపొందిన పాక్, 1-0తో సిరీస్‌ను సొంతం చేసుకుంది. 2024 అక్టోబర్ తర్వాత పాకిస్థాన్‌కు ఇదే మొదటి సిరీస్ విజయం కాగా, ప్రస్తుత ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ (డబ్లు



సైకిల్‌లో 11 మ్యాచ్‌లలో ఇది మూడో గెలుపు కావడం గమనార్హం. నాలుగో రోజు ఉదయం 90 పరుగుల లక్ష్యాన్ని పాక్ కేవలం 13 ఓవర్లలోనే ఛేదించగా, ఆమర్ జమాల్ (22 బంతుల్లో 34లి, 5 ఫోర్లు, 1 సిక్స్), అజాన్ అవైస్ (32లి) అజేయంగా నిలిచారు.

మరోవైపు శ్రీలంక విదేశీ పర్యటనల వైఫల్యాలు కొనసాగుతున్నాయి. మార్చి 2024లో బంగ్లాదేశ్‌పై సిరీస్ గెలిచిన తర్వాత లంకకు ఇది వరుసగా నాలుగో విదేశీ టెస్ట్ సిరీస్ ఓటమి. అంతేకాకుండా 1997 తర్వాత తొలిసారి క్యాలెండర్ ఇయర్‌లో ఒక్క టెస్ట్ విజయం కూడా లేకుండానే శ్రీలంక 2026 ఏడాదిని ముగించింది. తొలి ఇన్నింగ్స్‌లో కేవలం 98 పరుగులకే కుప్పకూలి 227 పరుగుల భారీ లోటును ఎదుర్కోవడమే శ్రీలంక ఓటమికి ప్రధాన కారణమైంది.

ఈ సిరీస్‌లో నలుగురు యువ ఆటగాళ్లు అరంగేట్రం చేయగా, వారి ప్రదర్శనపై పాక్ కెప్టెన్ బాబర్ ఆజమ్ ప్రశంసలు కురిపించాడు. డ్రెస్సింగ్ రూమ్ వాతావరణం సానుకూలంగా ఉందని, యువ ఆటగాళ్లు అవకాశాలను అందిపుచ్చుకున్నారని కొనియాడాడు. ముఖ్యంగా వికెట్ కీపర్ ఘజీ ఘోరీ బ్యాటింగ్‌తో పాటు, తొలి ఇన్నింగ్స్‌లో 145 కి.మీ వేగంతో బౌలింగ్ చేసి కీలక వికెట్లు తీసిన పేసర్ రజావుల్లాను బాబర్ ప్రత్యేకంగా అభినందించాడు.మ్యాచ్, సిరీస్ హీరోగా నిలిచిన మహమ్మద్ అబ్బాస్ మాట్లాడుతూ.. సాకిబ్ గాయపడటంతో తనపై బాధ్యత పెరిగిందని, పరిస్థితులకు తగ్గట్టుగా పొదుపుగా బౌలింగ్ చేస్తూ ఇతర బౌలర్లకు సహకరించానని తెలిపాడు. ఇక శ్రీలంక కెప్టెన్ కుశాల్ మెండిస్ మాట్లాడుతూ.. తొలి ఇన్నింగ్స్‌లో తాను సహా అంగీకరించాడు.

ఉద్యోగం రాగానే క్రెడిట్ కార్డు తీసుకున్నారా? ఆదమరిస్తే అంతే సంగతులు.. ఈ 5 జాగ్రత్తలు తీసుకోండి!

ఈ రోజుల్లో చాలా మంది క్రెడిట్ కార్డుల్ని వాడుతున్నారు. చాలీచాలని జీతంతో ఇబ్బంది పడేవారు ఈఎంఐలు చెల్లించడానికి ఎక్కువగా క్రెడిట్ కార్డుల్ని వాడుతుంటారు. అయితే కొందరు కాస్త సంపాదన వస్తుండగానే క్రెడిట్ కార్డుల్ని తీసుకుంటుంటారు. కానీ ఇక్కడ నిర్లక్ష్యంగా మాత్రం అసలే ఉండొద్దు. కొన్ని జాగ్రత్తల్ని కచ్చితంగా తీసుకోవాల్సి ఉంటుంది. మరి ఇప్పుడు క్రెడిట్ కార్డుల విషయంలో ఏయే జాగ్రత్తలు తీసుకోవాలో చూద్దాం.

ప్రస్తుత కాలంలో పెరుగుతున్న ద్రవ్యోల్బణం నేపథ్యంలో ఎంత సంపాదించినా ఎటూ చాలట్లేదు. దీంతో చాలా మంది ఇతరుల దగ్గర అప్పులు చేస్తుంటారు. కొందరు స్నేహితుల దగ్గర, కొందరు బంధువుల దగ్గర లేదా కొందరు బ్యాంకుల్లో అప్పులు తీసుకుంటుంటారు. అయితే ఇక్కడ ఇంకొందరు క్రెడిట్ కార్డుల్ని వాడుతుంటారు. క్రెడిట్ కార్డుల ద్వారా ఖర్చు చేస్తే అవసరం అప్పటికప్పుడు తీరుతుంది. తిరిగి చెల్లించడానికి కాస్త గడువు లభిస్తుంది. దీంతో చాలా మంది క్రెడిట్ కార్డుల్ని కూడా తీసుకుంటున్నారు. కొందరు ఒకటికి మించి



కార్డుల్ని కూడా వినియోగిస్తుంటారు. అయితే ఇక్కడ ఓపిక, ఆర్థిక క్రమశిక్షణ కచ్చితంగా ఉండాలి. కొందరు ఉద్యోగం వచ్చిన కొత్తలో వెంటనే క్రెడిట్ కార్డును తీసుకుంటుంటారు. ఆన్‌లైన్ షాపింగ్ నుంచి మొదలుకొని ప్రయాణాలు, ఫుడ్ ఆర్డర్స్, వినోదం ఇలా ఎన్నో అవసరాలకు కార్డును ఉపయోగిస్తుంటారు.ఇక్కడ కొనుగోలు చేసిన వెంటనే బ్యాంక్ అకౌంట్ నుంచి డబ్బు తగ్గకపోవడం, తర్వాత చెల్లించే వెసులుబాటు ఉండటం వల్ల ఖర్చు చేస్తున్నామన్న ఆలోచన కూడా పెద్దగా ఉండదు. నెలాఖరుకు బిల్లు చూస్తే మాత్రం ఆదాయం కంటే ఖర్చులే ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తుంది. ఇంకా ఇక్కడ సకాలంలో చెల్లింపులు చేయకుంటే వడ్డీ, ఇతర రుసుముల భారం పెరుగుతుంది. అందుకే క్రెడిట్ కార్డు తీసుకున్న మొదటి నుంచే సరైన ఆర్థిక క్రమశిక్షణ అలవర్చుకోవాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో క్రెడిట్ కార్డు తీసుకున్న యువత తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి చూద్దాం.

ముందుగా క్రెడిట్ కార్డు పరిమితి . లిమిట్ ఉంది కదా అని ఎంత పడితే అంత ఖర్చు చేయొచ్చు. ఇది ఆదాయం కాదు. అప్పు అని గుర్తుంచుకోవాలి. ఏదైనా కొనే ముందు ఒకటికి రెండు సార్లు ఆలోచించుకోవాలి. అన్ని ఖర్చుల్ని పరిగణనలోకి తీసుకొని ఇది లెక్కవేసుకోవాలి. చాలా వరకు లిమిట్‌లో 30 శాతం మించి ఖర్చు చేయకపోవడమే మంచిది.

రెండోది మినిమం డ్యూ. చాలా మంది బిల్లు మొత్తం కాకుండా మినిమం డ్యూ చెల్లిస్తుంటారు. ఇది కడితే పూర్తి బాకీ తీరినట్లు కాదు. మిగతా మొత్తంపై వడ్డీ భారీగా పడుతుంది. అందుకే పూర్తి మొత్తం కట్టడం మంచిది. ఆటోపే ఏర్పాటు చేసుకోవడం లేదా రిమైండర్స్ సెట్ చేసుకోవడం వల్ల ఇక్కడ నిర్లక్ష్యం తగ్గించుకోవచ్చు.

కనిష్ఠం నుంచి 1,500 పాయింట్లు ఎగబాకిన సెన్సెక్స్, 25,800 తాకిన నిఫ్టీ

దేశీయ స్టాక్ మార్కెట్లు ఇవాళ (శుక్రవారం) అద్భుతమైన రికవరీతో సరికొత్త రికార్డుల దిశగా దూసుకెళ్లాయి. అంతర్జాతీయ మార్కెట్ల బలహీన సంకేతాలతో ఆరంభంలో భారీ నష్టాలతో మొదలైనప్పటికీ, ఆ తర్వాత అనూహ్యంగా పుంజుకుని భారీ లాభాల్లో స్థిరపడ్డాయి. ఇంట్రాడే కనిష్ఠ స్థాయి నుంచి సెన్సెక్స్ ఏకంగా 1,500 పాయింట్ల మేర ఎగబాకగా, నిఫ్టీ కీలకమైన 25,800 మార్కును తిరిగి కైవసం చేసుకుంది.బీఎస్ఈ సెన్సెక్స్: క్రితం ముగింపు (83,021.75)తో పోలిస్తే ఈరోజు 82,558.25 వద్ద నష్టాలతో ప్రారంభమై, ఒక దశలో 82,403.27 కనిష్ఠ స్థాయికి పడిపోయింది. అయితే ఆ తర్వాత వెనుదిరిగి చూడకుండా ఇంట్రాడేలో 84,037.96 గరిష్ఠాన్ని తాకి, చివరకు 897.96 పాయింట్లు (1.08%) లాభపడి 83,919.71 వద్ద స్థిరపడింది.

ఎన్ఎస్ఈ నిఫ్టీ: 25,368.00 వద్ద ప్రారంభమై 25,345.20 కనిష్ఠ స్థాయిని తాకిన నిఫ్టీ, ఆ తర్వాత భారీగా పుంజుకుని 286.30 పాయింట్లు (1.12%) లాభంతో 25,800.60 వద్ద ముగిసింది.బ్యాంక్ నిఫ్టీ ఏకంగా 2.5% మేర ఎగబాకి చరిత్రలో తొలిసారిగా 64,600 మార్కును తాకింది. నేటి ట్రేడింగ్‌లో 1,582 షేర్లు లాభపడగా, 2,456 షేర్లు నష్టపోయాయి (179 షేర్లలో ఎలాంటి మార్పు లేదు).మార్కెట్ భారీ రివర్సల్‌కు ప్రధాన కారణాలుబ్యాంక్ నిఫ్టీ రికార్డు జోరు: బ్యాంకింగ్ షేర్లలో భారీగా కొనుగోళ్లు వెల్లువెత్తాయి. ఇండస్ఇండ్ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్ షేర్లు ర్యాలీకి నాయకత్వం వహించడంతో బ్యాంక్ నిఫ్టీ 2.5% పెరిగి చరిత్రలో తొలిసారిగా 64,600 స్థాయిని అందుకుంది.ఐటీ షేర్ల అండ: ఆంధ్రోపిక్ అరంగేట్రం తర్వాత అంతర్జాతీయంగా ఏఐ షేర్లలో



అమ్మకాలు వెల్లువెత్తాయి. దీంతో అమెరికా మార్కెట్లు (నాస్‌డాక్, డౌ జోన్స్) 2% పైగా, ఆసియా మార్కెట్లు (నిక్కీ 4.1%, కోస్పీ 4.7%) భారీగా పతనమయ్యాయి. అయినప్పటికీ, దేశీయ ఐటీ ఇండెక్స్ 1% లాభపడింది. టెక్ మహీంద్రా, ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్, టీసీఎస్ షేర్లు 1% నుంచి 1.7% వరకు పెరిగి మార్కెట్‌కు అండగా నిలిచాయి.విదేశీ పెట్టుబడుల ప్రవాహం విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు వరుసగా 8వ సెషన్‌లోనూ కొనుగోళ్లు కొనసాగిస్తూ గురువారం ఒక్కరోజే నికరంగా రూ. 7,411 కోట్ల విలువైన షేర్లను కొనుగోలు చేశారు (మరోవైపు రూ. 1,356 కోట్ల అమ్మకాలు జరిపారు). గతంలో ఏఐ ట్రేడ్ కోసం విదేశీ ఇన్వెస్టర్లు ఏ భారతీయ బ్యాంకింగ్, విజయకుమార్ విశ్లేషించారు.

బంగారం, వెండి ధరల భారీ పతనం..

బంగారం, వెండి ధరలు భారీగా పతన మయ్యాయి. వరుసగా మూడో రోజు కూడా భారీగా తగ్గాయి. అంతర్జాతీయ భౌగోళిక రాజకీయ కారణాల నేపథ్యంలో విలువైన లోహాల ధరలు పడిపోతున్నాయి. ఈ రోజు (శుక్రవారం) దేశీయ మార్కెట్లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారంపై ఏకంగా రూ.5120 తగ్గగా.. 22 క్యారెట్ల బంగారంపై రూ.4700 మేర ధర తగ్గింది. మరోవైపు వెండి ధర కూడా భారీగా పడిపోయింది. కిలో వెండిపై ఏకంగా రూ.5,000 తగ్గింది. దీంతో కొనుగోల ుదారులకు భారీ ఊరట లభించినట్లయింది .గుడ్‌రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, శుక్రవారం ఉదయం పది గంటల సమయంలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.5120 తగ్గి రూ.1,2 5,570కు చేరింది అలాగే ఆభరణాల తయారీకి ఉపయోగించే 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర



రూ.4700 తగ్గి రూ.1,15,100 వద్దకు దిగివచ్చింది. బంగారంతో పాటు వెండి ధర కూడా భారీగా తగ్గింది. కిలో వెండిపై రూ.5,000 తగ్గింది. ప్రస్తుతం హైదరాబాద్, విజయవాడలో కిలో వెండి ధర రూ.1.75 లక్షలకు చేరింది.

నాగ చైతన్య టైమ్ ట్రావెల్ లవ్ స్టోరీ?.. డైరెక్టర్ ఎవరంటే?



'వృషకర్మ' చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రానున్న నాగచైతన్య.. తన నెక్ట్స్ సినిమా జోనర్ ఏంటనేది వెల్లడించారు. ఈసారి ఒక బ్యూటిఫుల్ లవ్ స్టోరీ చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఇది చైతూ కెరీర్ లో ల్యాండ్ మార్క్ 25వ సినిమా కానుంది. యంగ్ డైరెక్టర్ క్లాక్స్ దర్శకత్వంలో ఈ చిత్రం తెరకెక్కనుందని సమాచారం. అల్లు అరవింద్ నిర్మించనున్న ఈ చిత్రంలో సాత్విక వీరవల్లి హీరోయిన్‌గా నటించనుంది. నవంబర్ 23న చైతూ పుట్టినరోజున ఈ సినిమాకి సంబంధించిన అధికారిక ప్రకటన వచ్చే అవకాశముంది.అక్కినేని నాగ చైతన్య ప్రస్తుతం 'వృషకర్మ' మూవీ ప్రమోషన్స్ లో బిజీగా ఉన్నారు. ఇప్పటికే షూటింగ్ కంప్లీట్ చేసుకున్న ఈ సినిమా.. డిసెంబర్ 4న పాన్ ఇండియా స్థాయిలో భారీ ఎత్తున థియేటర్లలో విడుదల కానుంది. ఈ మూవీపై అందరిలోనూ మంచి అంచనాలు ఉన్నాయి. ఇప్పటికే రిలీజైన ప్రమోషనల్ కంటెంట్ సినిమాపై హైప్ క్రియేట్ చేసింది. దీంతో చైతూ టాప్ లీగ్ లో చేరిపోయే అవకాశాలు ఉన్నాయని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే దీని తర్వాత చైతన్య ఎలాంటి సినిమా చేయబోతున్నారనేది చర్చనీయాంశంగా మారింది.నాగ చైతన్య 24వ సినిమాగా 'వృషకర్మ' తెరకెక్కుతోంది. ఆయన కెరీర్ లో ల్యాండ్ మార్క్ 25వ మూవీని ఎవరైనా స్టార్ డైరెక్టర్ తో చేయాలని అక్కినేని అభిమానులు కోరుకుంటున్నారు. కానీ చైతూ మాత్రం ఒక్క సినిమా అనుభవం ఉన్న డైరెక్టర్ క్లాక్స్ దర్శకత్వంలో తన సిల్వర్ జూబ్లీ మూవీ చేయడానికి రెడీ అయ్యారని చాలా రోజులుగా టాక్ వినిపిస్తోంది. ఇదొక టైమ్ ట్రావెల్ మూవీ అనే ప్రచారం జరుగుతోంది. కెరీర్ ప్రారంభం నుంచీ విభిన్నమైన సినిమాలు చేస్తూ వస్తున్న చైతన్య.. ఈసారి ఒక కొత్త జోనర్ తో ప్రేక్షకులను అలరించనున్నట్లు ఊహాగానాలు వినిపిస్తున్నాయి.
'చలో పదవే' సాంగ్ లాంచ్ ఈవెంట్ లో నాగ చైతన్య తన తదుపరి సినిమాపై స్పందించారు. ఈసారి ఒక బ్యూటిఫుల్ లవ్ స్టోరీ చేయనున్నట్లు తెలిపారు. ఒక ప్రేక్షకుడిగా, యాక్టర్ గా ప్రేమ అనుకుంటున్నట్లు చెప్పారు.

టాలీవుడ్‌లో సూర్య సరికొత్త చరిత్ర..
రజనీకాంత్‌కు కూడా సాధ్యం కాని అరుదైన రికార్డు



కోలీవుడ్ స్టార్ హీరో సూర్య తెలుగు బాక్సాఫీస్ వద్ద సరికొత్త చరిత్ర సృష్టించారు. ఆయన తాజా చిత్రం 'సీన్' 13 రోజుల్లో ఏపీ, తెలంగాణలలో ఏకంగా రూ. 34.30 కోట్ల గ్రాస్ వసూలు చేసింది. 'రామాయణ' వంటి భారీ చిత్రం పోటీని తట్టుకుని, పరిమిత షోలతోనే ఈ ఘనత సాధించడం విశేషం. ఈ ఏడాది విడుదలైన 'కరుప్పు' (రూ. 38.02 కోట్లు), 'విశ్వనాథ్ అండ్ సన్స్' (రూ. 63.96 కోట్లు), తాజాగా 'సీన్' చిత్రాలతో ఒకే క్యాలెండర్ ఏడాదిలో వరుసగా మూడు రూ. 30 కోట్ల+ గ్రాస్ చిత్రాలను అందించిన తొలి పరభాషా హీరోగా సూర్య నిలిచారు. సూపర్ స్టార్ రజనీకాంత్‌కు కూడా సాధ్యం కాని ఈ రికార్డుతో 2026లో సూర్య తెలుగు సినిమాల మొత్తం వసూళ్లు రూ. 136.30 కోట్లకు చేరాయి.కోలీవుడ్ స్టార్ హీరో సూర్యకు తెలుగు రాష్ట్రాల్లో ఉండే క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. తన విలక్షణమైన నటనతో ఎప్పుడో తెలుగు ప్రేక్షకుల మనసు గెలుచుకున్న ఆయన 2026లో బాక్సాఫీస్ వద్ద వరుస విజయాలతో సరికొత్త చరిత్ర సృష్టించారు. తాజాగా సూర్య నటించిన 'సీన్' చిత్రం థియేటర్లలో 13 రోజుల ప్రదర్శన పూర్తి చేసుకుని తెలుగు రాష్ట్రాల్లోనే ఏకంగా రూ. 34.30 కోట్ల భారీ గ్రాస్ వసూళ్లను రాబట్టింది. తద్వారా ఒకే క్యాలెండర్ ఏడాదిలో తెలుగు బాక్సాఫీస్ వద్ద వరుసగా మూడు 'రూ. 30 కోట్ల+' గ్రాస్ చిత్రాలను అందించిన మొట్టమొదటి నాన్-తెలుగు హీరోగా సూర్య అరుదైన ఘనతను సొంతం చేసుకున్నారు.'సీన్' చిత్రంతో సూర్య అందుకున్న ఈ విజయం సాధారణమైనది కాదు.

జనవరి 12 విడుదల' నుంచి ఫస్ట్ సింగిల్ అప్‌డేట్..
'దివికి దివికి' ప్రోమో విడుదల!




విక్టరీ వెంకటేష్, నందమూరి కళ్యాణ్ రామ్ ప్రధాన పాత్రల్లో సెన్సేషనల్ డైరెక్టర్ అనిల్ రావిపూడి తెరకెక్కిస్తున్న మోస్ట్ అవైటెడ్ చిత్రం 'జనవరి 12 విడుదల'. సంక్రాంతి కానుకగా 2027 జనవరి 12న ప్రపంచవ్యాప్తంగా భారీ స్థాయిలో విడుదల కానున్న ఈ సినిమా ప్రమోషన్లను చిత్రబృందం ఘనంగా ప్రారంభించింది. ఇందులో భాగంగా సినిమాలోని తొలి పాట 'దివ్వికి దివ్వికి' సంబంధించిన సాంగ్ ప్రోమోను తాజాగా విడుదల చేసింది. సంగీత దర్శకుడు జీవీ ప్రకాష్ కుమార్ ఈ చిత్రానికి స్వరాలు సమకూరుస్తుండగా, ఈ పాటతో మ్యూజికల్ మ్యాజిక్ ఖాయమని టీమ్ పోస్ట్‌లలో ఆసక్తిని రేకెత్తించింది.వెంకటేష్, కళ్యాణ్ రామ్ కలిసి నటిస్తున్న తొలి చిత్రం కావడంతో 'జనవరి 12 విడుదల'పై ఆరంభం నుంచే భారీ అంచనాలు నెలకొన్నాయి. వీరిద్దరి సరసన కీర్తి సురేష్, కృతి శెట్టి కథానాయికలుగా నటిస్తున్నారు. షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, సురేష్ ప్రొడక్షన్స్, జీ స్టూడియోస్, జీ స్టూడియోస్ సౌత్, జీ మ్యూజిక్ సౌత్ వంటి ప్రముఖ సంస్థలు ఉన్నాయి.

'ఆకాశంలో ఒక తార' సినిమాను ఆకాశానికి ఎత్తేసిన ఎస్.ఎస్.రాజమౌళి, ఎన్టీఆర్



దుల్కర్ సల్మాన్ హీరోగా పవన్ సాధినేని దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఆకాశంలో ఒక తార'. శుక్రవారం థియేటర్లలో విడుదలైన ఈ సినిమాపై దర్శక ధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి ప్రశంసలు కురిపించారు. అల్లు సినిమాస్‌లో కుటుంబంతో కలిసి ప్రీమియర్ షో చూసిన ఆయన, నటీనటుల అద్భుత ప్రదర్శనలతో సినిమా గొప్ప విజయం సాధించిందని ఎక్స్ వేదికగా కొనియాడారు. మరోవైపు జూనియర్ ఎన్టీఆర్ ఈ సినిమాకి తన బెస్ట్ విషెస్ అందజేశారు.దుల్కర్ సల్మాన్ ప్రధాన పాత్రలో నటించిన తాజా చిత్రం 'ఆకాశంలో ఒక తార'. పవన్ సాధినేని దర్శకత్వం వహించిన ఈ సినిమాని అల్లు అరవింద్ సమర్పించారు. శుక్రవారం (నవంబర్ 20) ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమా.. ప్రీమియర్ షోల నుంచే హిట్ టాక్ తెచ్చుకుంది. ఈ చిత్రంపై దర్శక ధీరుడు ఎస్.ఎస్ రాజమౌళి ప్రశంసలు కురిపించారు. సినిమా అద్భుతంగా ఉందని చిత్ర బృందాన్ని అభినందించారు. మరోవైపు ఎన్టీఆర్ ఈ సినిమా టీమ్ కి తన బెస్ట్ విషెస్ తెలియజేశారు.రాజమౌళి తన ఫ్యామిలీతో కలిసి గురువారం రాత్రి అల్లు సినిమాస్‌లో 'ఆకాశంలో ఒక తార' ప్రీమియర్ షో చూశారు. సోషల్ మీడియా వేదికగా తన రివ్యూ పంచుకున్నారు. "కల కనడం ఒక వరం. దాన్ని నిజం చేసుకోవడానికి పట్టుదల, దృఢ సంకల్పం అవసరం. చూసూ బృందానికి ఇవి రెండూ ఉన్నాయి. నటీనటులందరి అద్భుతమైన ప్రదర్శనలతో, 'ఆకాశంలో ఒక తార' ఒక గొప్ప విజయాన్ని అందుకుంది" అని రాజమౌళి ఎక్స్ లో పోస్ట్ పెట్టారు. దీనికి చిత్ర యూనిట్ స్పందిస్తూ జక్కన్నకు థ్యాంక్స్ చెప్పారు. మరోవైపు 'ఆకాశంలో ఒక తార' విడుదల సందర్భంగా జూనియర్ ఎన్టీఆర్ చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. తనకు అత్యంత సన్నిహితులైన పలువురు ఈ సినిమాలో భాగమయ్యారని అన్నారు. కొత్తదనం ఉన్న కథలను ప్రోత్సహించడంలో 'స్వప్న సినిమాస్' ఎప్పుడూ ముందుంటుందని ఎన్టీఆర్ ప్రశంసించారు. మంచి సినిమాలపై అల్లు అరవింద్, గీతా ఆర్ట్స్‌కు ఉన్న నమ్మకం మరోసారి కనిపిస్తోందన్నారు. దుల్కర్ సల్మాన్, సాత్విక వీరవల్లికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. సినిమా చాలా ఆసక్తికరంగా ఉందని, కచ్చితంగా మంచి ఆదరణ సొంతం చేసుకుంటుందని తనకు నమ్మకం
ఉందని తారక్ పేర్కొన్నారు.

ధనుష్ 'ఓం' రివ్యూ.. ఎర్రచందనం స్మగ్లింగ్ నేపథ్యంలో వచ్చిన సినిమా ఎలా ఉందంటే!




'అమరన్' విజయం తర్వాత దర్శకుడు రాజ్‌కుమార్ పెరియసామి తెరకెక్కించిన తాజా చిత్రం 'ఓం' (ర.వీ). ధనుష్, మమ్ముట్టి, సాయి పల్లవి, శ్రీలీల, శివాజీరాజా వంటి భారీ తారాగణంతో ధనుష్ స్వయంగా నిర్మించిన ఈ సినిమా, సాయి అభ్యంకర్ సంగీతంతో నేడు థియేటర్లలో విడుదలైంది. 2015లో తిరుపతి అటవీ ప్రాంతంలో జరిగిన వాస్తవ సంఘటనల స్ఫూర్తితో రూపొందిన ఈ చిత్రం ప్రేక్షకులను ఎంతవరకు మెప్పించిందో చూద్దాం.కథ2014లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన అనంతరం, ఆంధ్ర -- తమిళనాడు సరిహద్దు ప్రాంతాల్లో విస్తరించిన ఎర్రచందనం స్మగ్లింగ్ నెట్‌వర్క్‌ను అరికట్టడం ఈ సినిమా ప్రధాన కథాంశం. అయితే ఈ కీలక బాధ్యతను స్పెషల్ టాస్క్‌ఫోర్స్ అధికారి నిత్యారెడ్డి (సాయి పల్లవి) స్వీకరిస్తుంది. స్మగ్లింగ్ సిండికేట్‌కు మూలమైన అబ్దుల్ హమీద్ (నసీరుద్దీన్ షా)ను చేరుకోవడానికి, అతని సన్నిహితుడైన బర్మా కార్తికేయన్ అలియాస్ సియా (మమ్ముట్టి) గ్యాంగ్‌లోకి ఓ రహస్య ఏజెంట్‌ను చొప్పించాలని నిర్ణయిస్తుంది.ఈ ఆపరేషన్ కోసం పళని (ధనుష్)ను ఎంపిక చేస్తారు. ఫోటోగ్రాఫర్ తిరుకుమారన్‌గా మారి సియా గ్యాంగ్‌లోకి అడుగుపెట్టిన పళని, మెల్లమెల్లగా సియా విశ్వాసాన్ని సంపాదిస్తాడు. అయితే, ఈ సీక్రెట్ మిషన్ ముందుకు సాగుతున్న కొద్దీ పళని వ్యక్తిగత జీవితంలో అనేక చిక్కులు ఎదురవుతాయి. భార్య (శ్రీలీల) విడాకులకు సిద్ధపడటానికి గల కారణమేమిటి? సియా వెనుక ఉన్న అసలు నెట్‌వర్క్ ఎలాంటిది? తిరు అండర్‌కవర్ పోలీసు అని తెలిసిన తర్వాత సియా ఎలా స్పందించాడు? స్మగ్లింగ్ గ్యాంగ్ వల్ల నిత్యారెడ్డి కుటుంబానికి జరిగిన అన్యాయం ఏమిటి? మిషన్ విజయవంతం కోసం నిత్యారెడ్డి చేసిన త్యాగం, తిరు ఎదుర్కొన్న నష్టాల నేపథ్యంలో చివరికి ఆపరేషన్ ఎలా ముగిసింది అనేది మిగతా కథ.విశ్లేషణవాస్తవ ఘటనకు భావోద్వేగాలను జోడించి, స్మగ్లింగ్ మాఫియా, పోలీస్ ఆపరేషన్, వ్యక్తిగత సంఘర్షణలను సమన్వయం చేస్తూ దర్శకుడు రాజ్‌కుమార్ పెరియసామి ఈ చిత్రాన్ని మలిచారు. అయితే, కథనంలో ఊహించని మలుపులు తక్కువగా ఉండటం, స్క్రీన్‌ప్లే రొటీన్‌గా సాగడం వల్ల సినిమా కొంతవరకు సాగదీతగా అనిపిస్తుంది. ఫస్టాఫ్ నెమ్మదిగా మొదలవుతుంది. పాత్రల పరిచయాలు, ఎర్రచందనం స్మగ్లింగ్ వ్యవస్థ పనితీరును వివరంగా చూపించడానికి ఎక్కువ సమయం కేటాయించడంతో కథనం నత్తనడకన సాగిన భావన కలుగుతుంది. ముఖ్యంగా ధనుష్, మమ్ముట్టి మధ్య సంబంధాన్ని బలంగా నెలకొల్పడానికి తీసుకున్న సమయం కొంచెం ఎక్కువైందనిపిస్తుంది. అయితే, ఇంటర్వెల్ సీన్ మాత్రం సెకండాఫ్‌పై ఆసక్తిని పెంచుతుంది. సెకండాఫ్‌లోనైనా ఆసక్తికరమైన ట్విస్టులు ఉంటాయని భావిస్తే, అక్కడ కూడా పెద్దగా ఆశ్చర్యపరిచే అంశాలు కనిపించవు. కథ, కథనాలు ముందుగానే ఊహించే విధంగా సాగుతాయి. పాత్రల మధ్య బంధాలు, ఎమోషనల్ సన్నివేశాలు సహజంగా కాకుండా కొంత కృత్రిమంగా, బలవంతంగా ఇరికించినట్లు అనిపిస్తాయి. పోలీసులకు, స్మగ్లర్లకు మధ్య సాగే ఘర్షణ కూడా ఆశించిన స్థాయిలో ఉత్కంఠను రేకెత్తించదు. వాస్తవ ఘటనల ఆధారంగా రూపొందినప్పటికీ, కథనంలో ఏకపక్ష ధోరణి ఎక్కువగా కనిపిస్తుందనే అభిప్రాయం కలుగుతుంది.నటీనటుల ప్రతిభఎలాంటి పాత్రలోనైనా ఇట్టే ఒదిగిపోయే ధనుష్, అండర్‌కవర్ అధికారి తిరు పాత్రకు పూర్తి న్యాయం చేశారు. యాక్షన్ సన్నివేశాలతో పాటు భావోద్వేగ ఘట్టాల్లోనూ తన అనుభవాన్ని చూపించారు. సాయి పల్లవి నిత్యారెడ్డి పాత్రలో పవర్‌ఫుల్ పోలీస్ అధికారిగా ఆకట్టుకున్నారు. యాక్షన్
సీన్లలోనూ ధీటుగా నటించి మెప్పించారు.

సంస్కారం వయసుతో పాటు పెరగాలి..
సీనియర్ జర్నలిస్ట్ వ్యాఖ్యలపై విశ్వక్ సేన్ ఫైర్! ?




తరుణ్ భాస్కర్ దర్శకత్వంలో తెరకెక్కిన 'ఈ ఎన్ఈ రిపీట్' సినిమా గురువారం విడుదలై పాజిటివ్ టాక్‌తో దూసుకుపోతోంది. ఈ నేపథ్యంలో చిత్రంపై సీనియర్ జర్నలిస్ట్ వీఎస్ఎన్ మూర్తి చేసిన పరోక్ష వ్యాఖ్యలు సినీ వర్గాల్లో, సోషల్ మీడియాలో తీవ్ర దుమారం రేపాయి. 'ఆకాశంలో ఒక తార' సినిమాను ప్రశంసిస్తూ.. "కుర్రాళ్ల సినిమా అంటే ఇది.. పిచ్చి గెంతులు, బూతు జోకులు కాదు" అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు 'ఈఎన్ఈ రిపీట్'ను ఉద్దేశించేనంటూ చర్చ మొదలైంది. అయితే ఈ విమర్శలపై హీరో విశ్వక్ సేన్ ఘాటుగా స్పందించారు. మరొక సినిమాను పొగుడుతూ, తమ చిత్రాన్ని పరోక్షంగా తక్కువ చేసి చూపేలా మాట్లాడిన తీరును ఆయన తప్పుబట్టారు.'కుర్రాళ్ల గురించి, వాళ్ల టేస్ట్ గురించి, టెస్టోస్టిరాన్ గురించి అంచనాలు వేసేంత అప్‌డేటెడ్‌గా మీరు ఉన్నారా? అన్నది నా రివ్యూ. ఒక సినిమాను మెచ్చుకోండి.. అంతేగానీ మరో సినిమాను తక్కువ చేసి మాట్లాడకండి. సంస్కారం, మంచితనం అనేవి వయసుతో పాటు పెరగాలి కానీ, తరగకూడదు' అంటూ విశ్వక్ సేన్ ఇచ్చారు.

వివాహబంధంలోకి అడుగుపెట్టనున్న
టాలీవుడ్ నటుడు శివ కందుకూరి.!



ప్రముఖ నిర్మాత రాజ్ కందుకూరి తనయుడు, టాలీవుడ్ యువ నటుడు శివ కందుకూరి త్వరలో వివాహబంధంలోకి అడుగుపెట్టబోతున్నారు. హైదరాబాద్‌కు చెందిన ఆర్కిటెక్ట్ శిశిర సింహతో ఆయన వివాహం ఈ ఏడాది డిసెంబర్‌లో జరగనుంది. తన కాబోయే జీవిత భాగస్వామి శిశిర సింహతో కలిసి దిగిన ఫొటోలను శివ కందుకూరి సోషల్ మీడియా ద్వారా పంచుకున్నారు. జీవితంలో మొదలైన ఈ కొత్త, అందమైన ప్రయాణం జీవితాంతం కొనసాగాలని ఆయన ఆకాంక్షించారు. ఇరు కుటుంబాల పెద్దల అంగీకారంతో, సన్నిహితుల మధ్య వీరి నిశ్చితార్థ వేడుక జరిగినట్లు సమాచారం. డిసెంబర్‌లో పెళ్లి జరగనుండటంతో కందుకూరి కుటుంబంలో పెళ్లి సందడి మొదలైంది. ఈ జంట తమ కొత్త జీవితాన్ని ప్రారంభించబోతున్న సందర్భంగా సినీ ప్రముఖులు, అభిమానులు సోషల్ మీడియా వేదికగా శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. 2020లో వచ్చిన చూసి చూడంగానే సినిమాతో పరిచయమయ్యారు.

తల్లిదండ్రులైన సమంత రాజ్
నిడిమోరు.. కొడుకుకు 'దేవ్ నిడిమోరు' అని నామకరణం!



టాలీవుడ్ నటి సమంత రూత్ ప్రభు, రాజ్ నిడిమోరు తల్లిదండ్రులయ్యారు. ఈ జంటకు పండంటి మగబిడ్డ జన్మించగా, తమ చిన్నారికి 'దేవ్ నిడిమోరు' అని పేరు పెట్టినట్లు తెలుస్తోంది. ఇంటికి కొత్త సభ్యుడి రాకతో ఇరు కుటుంబాల్లో పండుగ వాతావరణం నెలకొంది. ఈ సంతోషకర విషయాన్ని పంచుకుంటూ సమంత సోషల్ మీడియాలో ఒక ఎమోషనల్ ఫోటోను పోస్ట్ చేసింది. తమ ముద్దుల కొడుకు చిట్టి వేళ్లను పట్టుకుని ఉన్న ఆ చిత్రం నెటిజన్లను ఎంతగానో ఆకట్టుకుంటోంది.
ఇక తల్లిదండ్రులుగా కొత్త బాధ్యతల్లోకి అడుగుపెట్టిన సమంత, రాజ్ నిడిమోరులకు సినీ పరిశ్రమలోని సహచరులు, స్నేహితులు, అభిమానులు పెద్ద ఎత్తున శుభాకాంక్షలు తెలుపుతున్నారు. చిన్నారి దేవ్ నిడిమోరుకు ఆయురారోగ్యాలు, సకల సంతోషాలు కలగాలంటూ కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు.

Printed, published &owned. By ravula rajesham printed at. JORDAR publication H.NO.2-5_146 . jammikunta.dist. karimnagar Telangana state 505122..editor.ravula rajesham, email. editor jordar@gmail.com. cellphone 7780185674 PRGi numberTG TEL/25/A5224